ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com

ఆదివారం 11 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 115 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

రష్యా డీజిల్ ఎగుమతులపై

ఆంక్షలు ఎత్తివేత

పుతిన్‌తో ట్రంప్ భారీ డీల్- జెలెన్‌స్కీ ఆగ్రహం



2



పనామాలో భారీ భూకంపం

రిక్టర్ స్కేలుపై 7.6 తీవ్రత నమోదు..!

2



ఘనంగా ఎంగిలిపూల

బతుకమ్మ వేడుకలు

2

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబురాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. బతుకు చిత్రమే పాటగా మార్చి సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. ఇవాళ్టి నుంచి 9 రోజుల పాటు బతుకమ్మ సంబురాలు కనుల పండువగా జరగనున్నాయి. మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి... పసుపు, కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు, నానేబియ్యం, అట్ల, అలిగిన, వేపకాయ, వెన్నముద్దల బతుకమ్మల ఉత్సవాలు జరుగుతాయి. చివరిరోజు సద్దుల బతుకమ్మను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.

హైదరాబాద్, అక్టోబర్ 10 (సింగిడి)



తెలంగాణ సంస్కృతికి

ప్రతీక బతుకమ్మ

ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ ప్రజలకు, ప్రత్యేకించి రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. తొమ్మిది రోజుల పూల ఉత్సవాలను మహిళలందరూ ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆనందోత్సాహాల మధ్య, సంప్రదాయ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అత్యంత ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

హైదరాబాద్, అక్టోబర్ 10 (సింగిడి)

ధర్మపురి ప్రగతిలో పెద్దన్న..

జనం గుండెల్లో ఈశ్వరన్న

వంద పనులతో ప్రగతి సిరి | వైద్యం నుంచి వైకుంఠం వరకు

అన్నిరంగాల్లో ఆనాడే అభివృద్ధి... నియోజకవర్గ రూపు రేఖలు మార్చి..

వందల కోట్లతో పనులు..మౌలిక వసతులు

ఒక నియోజకవర్గ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడం, భవనాలు నిర్మించడమే కాదు.. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేయడం, రైతులకు సాగునీటి భరోసా కల్పించడం, ఆధ్యాత్మిక క్షేత్రాలకు కొత్త శోభ తీసుకురావడం, పట్టణాలు, పల్లెలకు ఆధునిక మౌలిక సదుపాయాలు అందించడం. ఈ సమగ్ర అభివృద్ధి దృక్పథంతో ధర్మపురి నియోజక వర్గంలో వందకు పైగా విభిన్న అవసరాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసిన ఘనత మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ కే దక్కింది.

(కరీంనగర్ బ్యూరో – సింగిడి)



వైద్య సదుపాయాల నుంచి ఆలయాల అభివృద్ధి వరకు.. పట్టణ సుందరీకరణ నుంచి గ్రామీణ రహదారుల వరకు.. సాగునీటి ప్రాజెక్టుల నుంచి సామాజిక వర్గాల భవనాల వరకు విస్తరించిన ఈ అభివృద్ధి ప్రస్థానం ధర్మపురి నియోజకవర్గ ముఖచిత్రంలో అనేక మార్పులకు నాంది పలికింది.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు..

ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ధర్మపురి నియోజకవర్గంలో వైద్య రంగానికి విశేష ప్రాధాన్యత లభించింది. రూ.9 కోట్లతో 50 పడకల మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం, పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని 30 నుంచి 50 పడకలకు విస్తరించడం, దయాలసిస్ కేంద్రం, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, రెండు బస్తీ దవాఖానాల నిర్మాణం వంటి పనులు పూర్తయ్యాయి. అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్‌ను రూ. 22 లక్షలతో అందుబాటులోకి తీసుకురావడం మరో ముఖ్యమైన కార్యక్రమం.

వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, సానికంగానే మెరుగైన చికిత్సలు అందించేందుకు ఈ సదుపాయాలు దోహదపడ్డాయి. ముఖ్యంగా తల్లులు, శిశువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి మెరుగైన వైద్య వసతులు అందుబాటులోకి రావడం ప్రజారోగ్య పరంగా కీలక పరిణామం.



విశిష్ట ఆలయానికి వైభవం.

తెలంగాణలోనే విశిష్ట ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరొందిన ధర్మపురి ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత లభించింది. ధర్మపురి ఆలయ సమగ్ర అభివృద్ధికి రూ.100 కోట్లు, ప్రధాన ఆలయ అభివృద్ధికి రూ.13 కోట్లు, ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.2.40 కోట్లు, రాజగోపురం నిర్మాణానికి రూ.కోటి, శివాలయంలో రథశాల, రథాల నిర్మాణానికి రూ.కోటి, మూడు అంతస్తుల రాతి రాజగోపురానికి రూ.2.50 కోట్లు, కోనేరు అభివృద్ధికి రూ.2.30 కోట్లు వంటి కార్యక్రమాలు పూర్తయ్యాయి.

సత్యవతి ఇసుక స్తంభం ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షలు, కొత్త టీటీడీ దేవస్థానంలో 66 గదుల నిర్మాణం, పుట్ట బంగారం ఆలయం, గంగాదేవి ఆలయం, నాగమ్మ ఆలయ నిర్మాణాలు, శివాలయ అభివృద్ధి వంటి కార్యక్రమాలు కూడా ఆధ్యాత్మిక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చాయి.

రాయపట్నం, తమ్మెనాల ప్రాంతాల్లో రాజ గోపురాల నిర్మాణం, దోనూర్ తదితర గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి ఒక్కో ఆలయానికి రూ.50 లక్షలు, బ్రాహ్మణ సంఘం వద్ద రూ.5 కోట్లతో కళ్యాణ మండపం నిర్మాణం వంటి పనులు ధార్మిక, సాంస్కృతిక అవసరాలను నెరవేర్చాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ధర్మపురి ఆధ్యాత్మిక ప్రాధాన్యతను మరింత విస్తరించే దిశగా ఈ అభివృద్ధి కార్యక్రమాలు నిలిచాయి.

మున్సిపాలిటీగా ధర్మపురి.. పట్టణానికి కొత్త రూపురేఖలు.

ఒకప్పుడు పట్టణ పంచాయతీ పరిధిలో ఉన్న ధర్మపురి మున్సిపాలిటీగా రూపాంతరం చెందడం అభివృద్ధిలో కీలక ఘట్టం. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు, ఇంటర్నల్ డ్రైనేజీ వ్యవస్థకు రూ.8 కోట్లు, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.15 కోట్లు వంటి భారీ మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయి.

...మిగతా 2లో

ప్రకృతి సేద్యంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం

రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడమే లక్ష్యం

రసాయనాలతో పోలిస్తే ప్రకృతి సాగుతో 47 శాతం పెరిగిన రైతుల ఆదాయం

2



ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎండీఎస్)పై ఆయన శనివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు.

అమరావతి (సింగిడి)

కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు

2

అదనపు బస్సులు నడపాలని విజ్ఞప్తి

ఎల్‌నినోతో తీవ్ర సంక్షోభం

విద్యుత్ సమస్య ఉంది - పొదుపుగా వాడుకోండి : రేవంత్ రెడ్డి

తాజా పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభం పొంచి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కోవిడ్ తరహాలో ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. వచ్చే జూన్ వరకు తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ఇప్పటి నుంచి వచ్చే పకడ్బందీ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విస్తృత ప్రచారం చేసి ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తక్షణ చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సీఎం వెల్లడించారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోండి

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసర మైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉన్నందున చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

హైదరాబాద్, అక్టోబర్ 10 (సింగిడి)

2



ఢిల్లీ అష్ట దిగ్బంధనం

జంతర్ మంతర్ నిరసనలకు 'అజింక్య' నాయకత్వం

ఆకాశవాణి భవన్ వద్ద రాళ్ల దాడి

దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీజేపీ తలపెట్టిన నిరసనలకు ఇకపై అజింక్య శిందే నాయకత్వం వహిస్తారని అభిజీత్ దీప్కే ప్రకటించారు. తాము నిర్బంధంలో ఉన్నంత కాలం ఆయనే దీనికి నాయక్వం వహిస్తారని స్పష్టం చేశారు. జంతర్ మంతర్ 2.0 నిరసనలకు ఇకపై అజింక్య శిందే నాయకత్వం వహిస్తారని నీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం ప్రకటించారు.

న్యూఢిల్లీ, (సింగిడి)

2

ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు

సుప్రీంకోర్టు కీలక నిర్ణయం... ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ

గెలిస్తే నిజాయతీ-

ఓడితే అవకతవకలా?

2

ఈసీకి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌ల బహిరంగ లేఖ



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ దిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (సింగిడి)

రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి

ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

2



రష్యా డీజిల్ ఎగుమతులపై

ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (సింగిడి)

రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలుపై ఉన్న ఆంక్షలను ఎత్తివేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అంతేకాకుండా డీజిల్ కొనుగోళ్ల కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఒక ఒప్పందాన్ని కూడా కుదుర్చుకున్నారు. రష్యాతో కుదిరిన డీజిల్ సరఫరా ఒప్పందాన్ని ట్రంప్ గొప్ప విజయంగా అభివర్ణించారు. మరోవైపు దీనిపై ఉక్రెయిన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రష్యాతో ఉద్రిక్తతల తగ్గింపునకు సంబంధించి స్పష్టమైన, దీర్ఘకాలిక ఒప్పందం లేకుండా ఆంక్షలు సడలించడం బలహీనతకు నిదర్శమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ విమర్శించారు. ఈ నిర్ణయం వల్ల మాస్కోకు యుద్ధాన్ని మరింత కాలం కొనసాగించే అవకాశం లభిస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. శుక్రవారం పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్‌లో చర్చలు జరిపిన అనంతరం రష్యాపై ఆంక్షలు ఎత్తివేసినట్లు అమెరికా ట్రెజరీ విభాగం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7 వరకు రష్యా నుంచి డీజిల్ కొనుగోలు, రవాణా, దిగుమతులకు పూర్తి అనుమతిని మంజూరు చేసింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌కు రష్యా తక్షణమే 3 లక్షల టన్నులకు పైగా డీజిల్‌ను సరఫరా చేయనుందని ట్రంప్ ప్రకటించారు. తక్షణమే 3 లక్షల టన్నులకు పైగా డీజిల్ ఇంధనాన్ని సరఫరా చేయడానికి రష్యా అంగీకరించిందని ఆయన తెలిపారు. నవంబర్ నెలలో మరో 5 లక్షల టన్నులు, ఆ వెంటనే మరో 10 లక్షల టన్నుల డీజిల్‌ను మాస్కో సరఫరా చేయనుందని వివరించారు. అంతేకాకుండా అక్కడి రిఫైనరీల పరిస్థితి ఆధారంగా అతి తక్కువ కాలంలోనే ఏకంగా 30 లక్షల టన్నుల డీజిల్‌ను అమెరికాకు రష్యా అందజేస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. ఇది చాలా పెద్ద, అత్యంత ముఖ్యమైన ప్రకటన అని ఆయన అభివర్ణించారు. రష్యా నుంచి ముడిచమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై కఠినమైన ఆంక్షలు భారీ సుంకాలు విధించేలా ఇటీవల అమెరికా చట్టం రూపొందించిన నేపథ్యంలో స్వయంగా అమెరికాయే రష్యా నుంచి డీజిల్ తీసుకోవడం ఆసక్తికర పరిణామం

శాంతి బలహీనతతో రాదు : జెలెన్‌స్కీ

రష్యాపై ఒత్తిడి తగ్గించడం వల్ల శాంతి నెలకొనదని, పైగా ఉక్రెయిన్‌పై దాడులు మరింత పెరిగే ప్రమాదం ఉందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. మాస్కోకు ప్రయోజనం చేకూర్చే చర్యలు తీసుకునే బదులు, యుద్ధాన్ని ముగించేలా ఆ దేశంపై ఒత్తిడి పెంచాలని అమెరికాకు సూచించారు. బలహీనతతో శాంతిని సాధించలేని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అమెరికా మరింత బలమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించడంతో పాటు ఉక్రెయిన్ రక్షణకు మద్దతు కొనసాగించాలని పేర్కొన్నారు. అమెరికా కాంగ్రెస్‌కు చెందిన ఉభయ పార్టీల ప్రతినిధి బృందం కీవ్‌లో పర్యటించడాన్ని ఆయన స్వాగతించారు. యుద్ధాన్ని ముగించేందుకు ఏం చేయాలన్న ప్రశ్నకు బలమైన సమాధానం అవసరమని అన్నారు. అమెరికా కాంగ్రెస్‌లో ప్రతిపాదించిన లిండ్సే గ్రాహం బిల్లులోని ఆంక్షలను అమలు చేయాలని, రష్యాపై ఒత్తిడిని కొనసాగించాలని కోరారు. యూరప్‌లో ఇటీవల రష్యా కుబేరులపై ఆంక్షలను సడలించిన తర్వాత కూడా మాస్కో దాడులు తగ్గలేదని జెలెన్‌స్కీ ఆరోపించారు. ప్రజలపై దాడులు, విధ్వంసం కొనసాగుతున్నప్పుడు ఆంక్షలు సడలించడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు.

ట్రంప్ నిర్ణయంపై యూఎస్ సెనేటర్ ఫైర్

ఇదిలా ఉండగా రష్యాపై ఆంక్షల ఎత్తివేయడం, పుతిన్‌తో ఒప్పందం చేసుకోవడంపై యూఎస్ సెనేటర్ తీవ్రంగా స్పందించారు. రష్యా ఒప్పందం అవమానకరం అంటూ విమర్శించారు. ఉక్రెయిన్‌పై పుతిన్ చేస్తున్న యుద్ధంలో మనల్ని భాగస్వాములను చేస్తుందని యూఎస్ సెనేటర్ బ్లూమెంతల్ తెలిపారు. రష్యాతో ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని కోరారు. అలాగే అమెరికన్ చమురు కంపెనీలను కూడా హెచ్చరించారు. ఇక భారత్, చైనా పరోక్షంగా విమర్శిస్తూ, మీ పద్ధతులను మార్చుకోవాలని సూచించారు. వేరే చోట నుంచి చమురు కొనుగోలు చేయాలని హెచ్చరించారు.

ప్రకృతి సేద్యంలో దేశంలోనే

ఏపీ అగ్రస్థానం

ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2016లో కేవలం 40 వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ ప్రస్థానం నేడు 17.73 లక్షల మందికి చేరిందన్నారు. కొందరు గతంలో ఇది విజయవంతం కాదని దుష్ప్రచారం చేసినా, రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించారని కొనియాడారు. రసాయన ఎరువులతో భూసారం క్షీణించి, సాగు ఖర్చులు పెరిగి రైతులకు భారం అవుతోందన్నారు. కానీ ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. "రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సగటున 47 శాతం మేర ఆదాయం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల్లో 87 శాతం నికర ఆదాయం లభించింది. తీవ్రమైన కరవు పరిస్థితులను సైతం తట్టుకుని ఈ విధానంలో మంచి దిగుబడులు వస్తున్నాయి," అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీ ముందంజలో ఉందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రశంసించారని గుర్తుచేశారు.
గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 2.28 శాతం తగ్గిందని, దీనికి గాను కేంద్రం నుంచి రావాల్సిన రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశామని చంద్రబాబు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు అనంతపురం జిల్లాలో 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు తవ్వించామని, నదుల అనుసంధానంతో వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని అన్నారు. కషాయం, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల కోసం మరిన్ని గోకులాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులే తనకు అసలైన స్ఫూర్తి అని, వారి కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఎల్‌నినోతో తీవ్ర సంక్షోభం

ముఖ్యంగా తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు.
ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ఎనిమిది నెలలు ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనావేసి పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్‌లో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.
ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్ర తరమయ్యే ప్రమాదం పొంచి ఉందని సీఎం తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నప్పటికీ మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదన్నారు.అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం అందించాలి

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సుమారు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నందున కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని సీఎం గుర్తు చేశారు. వీబీ జీ రామ్‌జీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సీఎం సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ధర్మపురి ప్రగతిలో పెద్దన్న.. జనం గుండెల్లో ఈశ్వరన్న



మొదటి పేజీ తరువాయి

పట్టణ ప్రజలకు మెరుగైన మార్కెట్ సదుపాయం కల్పించేందుకు రూ.4 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం, బస్‌స్టాండ్ ఆధునీకరణకు రూ.2 కోట్లు, ధర్మశాల వద్ద రూ.1.50 కోట్లతో కేఎన్ఆర్ షాపింగ్ మాల్ వంటి నిర్మాణాలు చేపట్టబడ్డాయి.
చింతామణి చెరువు సుందరీకరణ, తమ్మలకుంట ఆధునీకరణ, ఐదు వాటర్ ట్యాంకుల నిర్మాణం, పట్టణానికి శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం సీపీడబ్ల్యూ పథకం పునర్నిర్మాణం, హనుమాన్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ అభివృద్ధి, ఓపెన్ జిమ్, ఫైర్ స్టేషన్, రిజిస్ట్రేషన్ కార్యాలయం, జమ్మి గద్దె నిర్మాణం వంటి పనులు కూడా పూర్తయ్యాయి.
పట్టణ విస్తరణకు అనుగుణంగా రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, ప్రజా సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా ధర్మపురికి ఆధునిక పట్టణ రూపు తీసుకొచ్చే ప్రయత్నాలు సాకారమయ్యాయి.

రహదారుల నిర్మాణం.. రవాణాకు మహర్దశ..



అభివృద్ధికి రహదారులే ప్రధాన ఆధారం. ఈ సూత్రానికి అనుగుణంగా ధర్మపురి నియోజకవర్గంలో పట్టణ, గ్రామీణ రహదారుల నిర్మాణం, విస్తరణకు విస్తృత స్థాయిలో పనులు పూర్తయ్యాయి. ధర్మపురి–బీర్‌పూర్ డబుల్ రోడ్డు, కమలాపూర్ రోడ్డు, గోదావరి రోడ్డు, హైవే విస్తరణ, క్యాంపు కార్యాలయం పరిసరాల్లో హైవే, డబుల్ రోడ్డు నిర్మాణం వంటి పనులు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచాయి.
క్యాంపు కార్యాలయం నుంచి రైస్ మిల్, అయ్యప్ప ఆలయం, కమలాపూర్ రోడ్డు మీదుగా జాతీయ రహదారి వరకు రహదారి అనుసంధానం, మేస్ రోడ్డు నుంచి ఎన్‌హెచ్-63 వరకు రూ.10 కోట్లతో రోడ్డు నిర్మాణం, రాయపట్నం చౌరస్తా సుందరీకరణకు రూ.3.50 కోట్లతో చేపట్టిన పనులు రవాణా వ్యవస్థలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.
తెనుగు వాడ రోడ్డు, నక్కలపేట రోడ్డు, గోదావరి పుర స్కారాల రోడ్డు, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె, బుద్దేశ్‌పల్లె, గుండయ్యపల్లె–వివేకానంద రోడ్డు, నైట్ కాలేజీ–బ్రాహ్మణ సంఘం రోడ్డు, సర్దార్ పటేల్ జంక్షన్, నంది రోడ్డు, నంది నుంచి హరిత హోటల్ వరకు రహదారులు, దమ్మన్నపేట వద్ద రెండు బ్రిడ్జిలు వంటి పనులు స్థానిక రవాణా సదుపాయాలకు తోడ్పడ్డాయి.



సాగునీటి రంగంలో రైతులకు భరోసా..

వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత లభించింది. 13 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణం, రోళ్లవాగు ప్రాజెక్టు, అరెపెల్లి నుంచి రాయపట్నం వరకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, మండలంలోని చెరువులు, కుంటల మరమ్మతులు వంటి కీలక కార్యక్రమాలు పూర్తయ్యాయి.



వంటి పనులు వ్యవసాయానికి అవసరమైన నీటి వనరుల అభివృద్ధికి దోహదపడ్డాయి. సాగునీటి వసతులు మెరుగుపడటంతో రైతులకు వ్యవసాయ కార్యకలాపాలను కొనసాగించేందుకు అదనపు అవకాశాలు ఏర్పడ్డాయి.
గ్రామాల్లో గోదాముల నిర్మాణం, అంతర్గత రహదారులు, నూతన గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామీణ సంఘ భవనాలు వంటి పనులు కూడా గ్రామీణ మౌలిక వసతుల విస్తరణలో భాగమయ్యాయి.

విద్య, యువత, క్రీడలకు ప్రోత్సాహం..

నియోజకవర్గ భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య, యువతకు క్రీడా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు పూర్తయ్యాయి. డిగ్రీ కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం, వైడెనింగ్ రోడ్డు, బీసీ డిగ్రీ కళాశాలను ధర్మపురికి తీసుకురావడం, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, దొంతాపూర్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఎస్టీ హాస్టల్ నిర్మాణం వంటి పనులు విద్యారంగానికి సంబంధించిన మౌలిక వసతులను బలోపేతం చేశాయి.యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రూ.2.50 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం చేపట్టడం మరో ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమం. విద్యార్థులు, యువతకు అవసరమైన వసతులను స్థానికంగానే కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు అవసరమైన అవకాశాలు విస్తరించాయి.



సామాజిక వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు.

సామాజిక సమానత్వం, అన్ని వర్గాల భాగస్వామ్యానికి అనుగుణంగా వివిధ సామాజిక వర్గాలకు భవనాలు, సదుపాయాల కల్పనకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ముస్లిం సమాజానికి రూ.30 లక్షలతో భవనం, శారద మహిళా మండలి భవనానికి రూ.30 లక్షలు, బ్రాహ్మణ సంఘం భవనం విస్తరణకు రూ.30 లక్షలు, అంబేద్కర్ భవనానికి రూ.2 కోట్లు వంటి పనులు పూర్తయ్యాయి.



వివిధ కుల సంఘాల భవనాలు, చర్చిలు, మసీదుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు, మహిళా సంఘాలకు అవసరమైన వసతులు, కమలాకర్ ఇందిరమ్మ కాలనీలో 20 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం వంటి పనులు సామాజిక మౌలిక వసతుల విస్తరణలో భాగమయ్యాయి.
అదనపు స్మశానవాటిక నిర్మాణానికి రూ.కోటి, లక్ష్మీ నరసింహ కాలనీలో రామాలయానికి రూ.20 లక్షలతో షెడ్, మానవతా కేంద్రం, స్మశానవాటికలు వంటి కార్యక్రమాలు ప్రజల సామాజిక, సాంస్కృతిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని పూర్తిచేసిన పనులుగా నిలిచాయి.

పల్లె నుంచి పట్టణం వరకు.. సమగ్ర అభివృద్ధి.

ధర్మపురి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యతని చ్చినట్లు వంద పనుల జాబితా స్పష్టం చేస్తోంది. దమ్మన్నపేట–దొంతాపూర్ రోడ్డు, అరెపెల్లి–రాయపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, గ్రామాల్లో అంతర్గత



రోడ్లు, సంఘ భవనాలు, సాగునీటి సదుపాయాలు, గోదాములు, గ్రామ పంచాయతీ భవనాలు వంటి పనులు గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతులను మెరుగుపరిచాయి.
ధర్మపురి పరిధిలోనే కాకుండా గ్రామాల అవసరాలకు అనుగుణంగా రహదారులు, సాగునీటి వసతులు, సామాజిక భవనాల నిర్మాణం చేపట్టడం ద్వారా

వంద పనులు.. అభివృద్ధికి చిరునామా

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నిర్మాణం నుంచి వందలాది ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల వరకు.. ఆలయాల అభివృద్ధి నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు.. వైద్య సేవల నుంచి పట్టణ సుందరీకరణ వరకు విస్తరించిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు ధర్మపురి నియోజకవర్గంలో విభిన్న రంగాలకు సంబంధించిన అవసరాలను స్పృశించాయి. కొన్ని పనులకు కోట్ల రూపాయల నిధులు వెచ్చించగా, మరికొన్ని పనులు ప్రజల రోజువారీ అవసరాలను తీర్చే చిన్నపాటి మౌలిక సదుపాయాలుగా నిలిచాయి. మొత్తంగా వంద అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేసిన ఈ ప్రస్థానం కొప్పుల ఈశ్వర్ హయాంలో ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఒక విస్తృత అధ్యాయంగా నిలుస్తోంది.

అభివృద్ధి ఫలాలు పట్టణానికే పరిమితం కాకుండా పల్లెలకూ విస్తరించాయి.

అభివృద్ధి అంటే మాటలు కాదు.. ప్రజల మధ్య కనిపించే పనులు. ధర్మపురిలో పూర్తయిన ఈ వంద అభివృద్ధి కార్యక్రమాలే ఆ ప్రగతి ప్రస్థానానికి ప్రతీకలు.



ఢిల్లీ అష్ట దిగ్బంధనం

తాము పోలీసుల నిర్బంధంలో ఉన్నంత కాలం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగే నిరసనలు, సీజేపీ ఇన్‌చార్జ్ అజింక్య శిందే నాయకత్వంలోనే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. "నన్ను అరెస్టు చేస్తారని ముందే ఊహించాను. అందుకే శుక్రవారం రాత్రి అజింక్య శిందే ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తాడని స్వయంగా చెబుతూ ఓ వీడియో రికార్డు చేశాను. అందుకే ఈ వీడియో చూస్తున్న వాళ్లు అజింక్య శిందేను అనుసరించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా శనివారం తెలిపారు.

పోలీసుల నిర్బంధంలో దీప్కే

ముంబయి నుంచి దిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్తున్న అభిజీత్ దీప్కేను శనివారం విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పోలీసుల అదుపులోనే ఉన్నారు. వీరిని విమానాశ్రయం నుంచి నేరుగా ఓ అజ్ఞాత ప్రాంతానికి తరలించారు.

ఎమర్జెన్సీ కన్నా దారుణం!

సీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజేపీ తలపెట్టిన నిరసనలను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం 'ఎమర్జెన్సీ కన్నా దారుణమైన నిర్బంధం' పెడుతోందని విమర్శించారు. బొద్దింకలను చూసి ప్రధాని మోదీ భయపడుతున్నారని అన్నారు. "ఇది ఎమర్జెన్సీ కన్నా దారుణం. మనం మోదీ సంపూర్ణ నియంతృత్వంలో బతుకుతున్నాం. విమానం దిగిన వెంటనే బొద్దింకలను అరెస్టు చేయడం, ప్రధాని మోదీకి ఉన్న భయాన్ని చూపిస్తుంది. కేవలం ఓటు చోరీ ద్వారా ఎన్నికల్లో గెలిచామని మోదీకి తెలుసు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అణచివేసి తన మోసాన్ని కాపాడుకోవడానికి కంకణం కట్టుకున్నారు. ఏదైనా సీఈసీ జ్ఞానేశ్ వెళ్లాలి. అలాగే మోదీ కూడా" అని కేజ్రీవాల్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.

పోలీసులపై రాళ్ల దాడి

మరోవైపు దిల్లీలోని ఆకాశవాణి భవన్ సమీపంలో 25-30 మంది నిరసనకారులు ఇంతియాజ్ అలీ మార్గ్‌లోని బారికేడ్లపై నుంచి దూకి భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారని, తాము కొందరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వాస్తవానికి జంతర్ మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన నిరసనలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా 500 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పలువురు నిరసనకారులు వేర్వేరు ప్రదేశాల నుంచి జంతర్ మంతర్‌కు వచ్చే ప్రయత్నం చేశారు. దీనితో పోలీసులు పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకోగా, మరికొందరిని వెనక్కు పంపించారు. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రస్తుత పరిస్థితుల నిన్నింటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు.

ఘనంగా ఎంగిలిపూల

బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఒక్క చోట చేరి తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా పేర్చి చప్పట్లు కొడుతూ చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. బతుకమ్మ నిర్వహణ కోసం పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతో పాటు విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచారు. మెదక్ జిల్లాలో పలు గ్రామాలలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, బాలాజీ మఠం, హౌసింగ్ బోర్డు తదితర కాలనీల్లో మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడి పాడారు.

కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 10 (సింగిడి)

దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారితో హైదరాబాద్‌లోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది. జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు ఉప్పల్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్ తదితర కూడళ్ల నుంచి కూడా ప్రత్యేక బోర్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. రద్దీ దృష్ట్యా శనివారం నుంచి ఈ నెల 22 వరకు 1300 బస్సులను వివిధ జిల్లాలకు నడిపేలా గ్రేటర్ ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. శుక్రవారం 50 అదనపు బస్సులను పంపినట్లు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ పేర్కొన్నారు.పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు అంటున్నారు. గంటల తరబడి బస్టాండ్‌లోనే వేచి ఉండాల్సివస్తోందని వాపోతున్నారు. మరిన్ని బస్సులు నడిపి తమను గమ్యస్థానాలకు చేర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. జేబీఎస్ నుంచి ఈ నెల 10 నుంచి 13 వరకు సాధారణ సర్వీసులతో పాటు రోజుకు వంద, 16, 17, 18 తేదీల్లో 300 నుంచి 400 అదనపు సర్వీసుల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చనున్నట్లు పికెట్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి రోజూ 3400 సర్వీసులను ఆర్టీసీ నడుపుతుండ

ప్రజల సమస్యల పరిష్కారానికే 'వన్ డే – వన్ వార్డ్'

- శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్
- అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో అధికారులతో కలిసి విస్తృత తనిఖీలు
- పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక





రామచంద్రపురం, అక్టోబర్ 10(సింగిడి): ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకే జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'వన్ డే – వన్ వార్డ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ స్పష్టం చేశారు. శుక్రవారం అమీన్‌పూర్ సర్కిల్ (47) పరిధిలోని పలు వార్డుల్లో ఆయన ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారుల బృందంతో కలిసి సుడిగాలి పర్యటన చేపట్టారు. రామచంద్రాపురం 268 డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కమ్యూనిటీ హాల్, సాయి నగర్ థీమ్ పార్క్‌లను ఆయన స్వయంగా పరిశీలించారు. స్థానిక నివాసితులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడి తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, డ్రైనేజీ తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయి నగర్ థీమ్ పార్క్ నిర్వహణను మెరుగుపరిచి, ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ.. కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ నిరంతరం నిఘాలో ఉండాలని, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుతం పురోగతిలో ఉన్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు లోపించకూడదని కాంట్రాక్టర్లు, అధికారులను హెచ్చరించారు. ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్దేశిత గడువులోగా అన్ని అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు, స్థానిక ప్రజలు అధికారులతో సమన్వయం చేసుకుంటూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)వెంకటరమణ, మున్సిపల్ అడిషనల్ కమిషనర్లు మనోహర్, శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) శివ, శానిటేషన్ సూపర్‌వైజర్ కేశవ్‌లతో పాటు మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల సిబ్బంది, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాధవరావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంపతి ఉదయ్ కుమార్ డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు10(సింగిడి): 'ప్రభాత నవ సింగిడి' దినపత్రిక కరీంనగర్ బ్యూరో ఇంచార్జి రాపాక శంకర్ పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన గోదావరిఖనికి చెందిన దేవరనేని మాధవరావును తక్షణమే అరెస్ట్ చేయాలని యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంపతి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5, 6 తేదీల్లో 'ప్రభాత నవ సింగిడి' పత్రికలో వచ్చిన రెండు వార్తలకు తనకూ ఏ సంబంధం లేకున్నా అభ్యంతరం తెలుపుతూ దేవరనేని మాధవరావు, మరికొందరు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శంకర్‌పై ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా శంకర్‌ను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేసారు. స్వయంగా కమిషనరేట్ ఆవరణలో మీడియా ముందే రాపాక శంకర్ ను 'క్రిమినల్స్', 'విచ్ఛిన్నకర శక్తులు', 'దోపిడీదారులు' అంటూ సంబోధిస్తూ ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారు. శంకర్ షెడ్యూల్డ్ కులానికి చెందిన జర్నలిస్టు అని తెలిసి కూడా, ఆయన సామాజిక గుర్తింపును దృష్టిలో ఉంచుకొని ఈ విధంగా అవమానించడం అత్యంత దారుణం. బాధ్యులైన వారందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలి. శంకర్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. ఈ వ్యవహారంపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సంపతి ఉదయ్ కుమార్ కోరారు. సమావే శానికి సంబంధించిన వీడియో దృశ్యాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమైన పోస్టులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సేకరించాలి. ఘటన సమయంలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, అక్కడి మీడియా ప్రతినిధులతో పాటు ఇతరుల నుంచి వివరాలు సేకరించి, డిజిటల్ ఆధారాలను భద్రపరచాలి. శంకర్ కు, ఆయన కుటుంబానికి భవిష్యత్తులో ఎలాంటి బెదిరింపులు లేదా వేధింపులు ఎదురుకాకుండా తగిన రక్షణ కల్పించాలి. ఈ ఘటనపై ఫిర్యాదును స్వీకరించి, తీసుకున్న చర్యలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని శంకర్ ఇప్పటికే ఏసీపీ ని కోరినట్లు ఉదయ్ కుమార్ వెల్లడించారు. "కంప్యూటర్ యుగంలో మనుషులంతా ఒక్కటే ఖబర్దార్ దేవరనేని మాధవరావు" అని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.



పూల పండుగ బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక





మిరుదొడ్డి, అక్టోబర్ 10(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం రోజున మండల కేంద్రంలోని విజ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం శీ పాఠశాలలో మహిళలు, విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆటా పాటలతో కోలాహలంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సత్తు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలు సామూహికంగా పాటలు పాడుతూ, ఆటలాడుతూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. పల్లె నుంచి పట్టణం వరకు బతుకమ్మ సంబురాలు ప్రజల్లో ఆనందాన్ని నింపుతాయన్నారు. పూలతో బతుకమ్మల పేర్చు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర స్థానికంగా లభించే పూలతో బతుకమ్మలను అందంగా పేర్చడం ఈ పండుగ ప్రత్యేకత అని చెప్పారు. వివిధ రంగుల పూలను వరుసలుగా అమర్చి బతుకమ్మను సిద్ధం చేస్తారన్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి జానపద గీతాలు ఆలపిస్తూ సంబురాలు జరుపుకుంటారన్నారు. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారన్నారు. ప్రతి రోజుకో ప్రత్యేకమైన పేరు, నైవేద్యం ఉండటం ఈ పండుగ విశిష్టత అని చెప్పారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా జరుపుకుంటారన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి పండుగ ఆనందాన్ని పంచుకుంటారన్నారు.

మహిళల ఐక్యతకు ప్రతీక

బతుకమ్మ పండుగ కేవలం పూల వేడుక మాత్రమే కాదు. మహిళల మధ్య ఐక్యతను, ఆత్మీయతను, తెలంగాణ జానపద సంప్రదాయాలను ప్రతిబింబించే సామూహిక పండుగ అని తెలిపారు. చిన్నారుల నుంచి వృద్ధుల వం-కు అందరూ కలిసి పాల్గొనడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ పాటల్లో కుటుంబ అనుబంధాలు, సామాజిక జీవనం, ప్రకృతి అందాలు ప్రతి ఫలిస్తాయన్నారు. ప్రకృతి పరిరక్షణకు పిలుపు అని పేర్కొన్నారు. ప్రకృతిలో సహజంగా లభించే పూలతో బతుకమ్మలను పేర్చే సంప్రదాయం అని అన్నారు. ప్రకృతి తో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తుందన్నారు. పండగ సందర్భంగా చెరువులు, కుంటలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తోపాటు నీటిని కలుషితం చేయకుండా పూలను నిమజ్జనం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పర్యావరణ రహితంగా పండుగను జరుపు కోవడం ద్వారా సంప్రదాయాలతో పాటు ప్రకృతిని కూడా కాపాడుకోవచ్చునని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృ తిలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పూల పండుగ తెలం గాణ ప్రజల జీవన విధానాన్ని ఆచారవ్యవహారాలను , సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆధునిక కాలంలోనూ యువత సాంప్రదాయాలను కొనసాగిస్తూ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం విశేషమన్నారు. పూల సౌందర్యం , పాటల మాధుర్యం, మహిళల సందడి కలగలిపి బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్తు సుజాత, ఉపాధ్యాయులు మంగ, తిరుమల రాణీ, స్వప్న,రజిత, వాణి, ఆంజనేయులు, సంపత్ తో పాటు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ విస్తృత తనిఖీలు



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 10(సింగిడి): జిల్లా పరిధిలోని కుల్కచర్లలో శుక్రవారం తెల్లవారు జామున 107 మంది పోలీసు సిబ్బందితో కాంటాక్ట్ తనిఖీలు నిర్వహించారు. 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 34 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పీ ఎస్ ఆదేశాల మేరకు, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వం-కు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 107 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కుల్కచర్ల గ్రామంలోని కిండిగేరి ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ ఇళ్ల తనిఖీలు, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల పరిశీలన వంటి ముందస్తు నేర నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో 54 ద్విచక్ర వాహనాలు,రెండు ఆటోలు పత్రాలు, సంబంధిత వివరాలను పరిశీలించే క్రమంలో స్వాధీనం చేసుకున్నారు. 34 లీటర్ల మద్యం తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు. నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఇద్దరు రౌడీషీటర్ల కదిలికలపై ఆరాదీశారు. వివరాలను పరిశీలించారు. ఈ తనిఖీల ద్వారా నేరాలకు అవకాశం కల్పించే పరిస్థితులను ముందుగానే గుర్తించడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడడం వంటి అంశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్, మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని డీఎస్పీ వివరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించడం, పోలీసు, ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేయడం, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండల్ రెడ్డి, కుల్కచర్ల, పరిగి, చెంగోముల్, దోమ, కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, 12 మంది మహిళా పోలీసు కానిస్టేబుళ్లు (మహిళా పీసీలు), ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మ ఆడిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



రామచంద్రాపురం, అక్టోబర్ 10(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు స్థానిక వి. గీతా భూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు భారతీ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను కళాశాల ప్రాంగణంలో కొలువుదీర్చి, విద్యార్థినులు, అధ్యాపకులతో కలిసి సింధు ఆదర్శ్ రెడ్డి లయబద్ధంగా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ "బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు నిదర్శనం. ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంప్రదాయం ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. నేటి యువత ఆధునిక పోకడల్లో పడి మన మూలాలను, విశిష్ట సాంప్రదాయాలను మర్చిపోకుండా భావితరాలకు అందించాలి. విద్యార్థినులు చదువుతో పాటు మన సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయం. ఆడపిల్లలు విద్యారంగంలో రాణించి స్వయం సమృద్ధి సాధించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది. సమాజంలో ప్రతి రంగంలోనూ మహిళలు ఉన్నత స్థానాలకు ఎదగాలని, అందుకు ప్రభుత్వం, సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని" ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్‌లలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 10 (సింగిడి): జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ లలో ఖాళీగా ఉన్న 102అంగన్వాడీ టీచర్ల పోస్టులకు,162 అంగన్వాడీ ఆయా పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. కోడంగల్ ప్రాజెక్టు లో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 13, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 31, మర్పల్లి అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 21, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 14, పరిగి ప్రాజెక్టు లో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 27, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 78, తాండూర్ ప్రాజెక్టు లో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 23, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 28 ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా వికారాబాద్ ప్రాజెక్టులో అంగన్వాడీ టీచర్ల పోస్ట్ ఖాళీలు 18, అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీలు 11 ఉన్నట్లు ఆయన తెలిపారు. అంగన్వాడీ టీచర్లు మరియు అంగన్వాడీ ఆయా పోస్టులకు సంబంధించిన అర్హతలు, వయోపరిమితి, స్థానీకత, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, నిబంధనలు మరియు ఇతర పూర్తి వివరాలు .. http://wdcw.tg.nic.in వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. అంగన్వాడి కేంద్రానికి కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం, ఆ రిజర్వేషన్ కు సంబంధించిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 10 నుండి 24 సాయంత్రం 5 గంటల వరకు http://wdcw.tg.nic.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి కలెక్టర్ తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తు చేసిన అభ్యర్థులు, సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు కార్యాలయ పనివేళలలో తమ దరఖాస్తుతో పాటు అవసరమైన ధృవీకరణ పత్రాలు గెజిటెడ్ అధికారితో ధృవీకరించిన జిరాక్స్ ప్రతులను సమర్పించాలని, కేవలం ఆన్లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకోబడుతుందని ఆయన తెలిపారు. ఈ నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ రద్దు చేయుటకు, సవరించుటకు, మార్పులు చేయుటకు లేదా అవసరమైన సూచనలు జారీ చేయుటకు జిల్లా కలెక్టర్ అండ్ చైర్మన్, కు పూర్తి అధికారం ఉంటుందని, ఏదైనా సమాచారం కోసం సంబంధిత చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారిని సంప్రదించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన

అవగాహన సదస్సులో పాల్గొన్న కొలను హనుమంత రెడ్డి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకొని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షిం చుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్లు ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి

పోలీస్ కమిషనర్ రక్షీ పెరుమాళ్



సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 10(సింగిడి): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ సెషన్ ను శుక్రవారం రోజున పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ ట్రాన్స్‌జెండర్లతో నేరుగా ముచ్చటించి, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ట్రాన్స్‌జెండర్లు వారి సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో అనేక ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయని, సమాజంలో గౌరవంగా జీవించేందుకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లాలో ఎంతమంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు, వారిలో ఉద్యోగం చేసేందుకు ఆసక్తి ఉన్నవారి వివరాలను సేకరిస్తున్నాం అని చెప్పారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు కల్పించేందుకు సెట్విన్ సంస్థ ప్రతినిధులతో చర్చించి, వారికి తగిన ఉద్యోగావకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి డిస్టెన్స్ లెర్నింగ్ ద్వారా చదువుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. ఈ డిజిటల్ యుగంలో సొంతంగా నైపుణ్యం పెంచుకోవడానికి ఎన్నో ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫార్మ్స్ అందుబాటులో ఉన్నాయని సూచించారు. ఏదైనా ఒక మంచి స్కిల్ నేర్చుకుని ఉద్యోగం లేదా ఉపాధి పొందితే సమాజంలో మంచి గుర్తింపు లభించడమే కాకుండా, అందరికీ ఆదర్శంగా నిలవవచ్చని పిలుపునిచ్చారు. ట్రాన్స్‌జెండర్లు ధైర్యంగా ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, సహాయ సహకారాల కోసం సిద్దిపేట పోలీస్ శాఖను ఎప్పుడైనా సంప్రదించవచ్చని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సెట్విన్ ప్రతినిధి అమీనా భాను తో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు స్వాగతం పలికిన నాయకులు



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 10(సింగిడి): కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీ పీ ఏ) కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు పలువురు నాయకులు, శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ శాసన వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ సీ పీ ఏ కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమని నాయకులు కొనియాడారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దుర్గ మల్లికార్జున్ గౌడ్, కొప్పుల రామకృష్ణరెడ్డి, ముదావత్ శ్రీకాంత్, కాకి నాగరాజ్, మాల శ్రీకాంత్, బాదం ఆశోక్, మధుకర్, బాలకృష్ణ, టీ డబ్ల్యూజే, ఐ జే యూ వికారాబాద్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ జాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్ ఇంటర్నేషనల్ సేల్స్ సర్వీస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి



సిద్దిపేట ప్రతినిధి అక్టోబర్ 10(సింగిడి): సిద్దిపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జపాన్ ఇంటర్నేషనల్ సేల్స్ సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి నూతనంగా ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగుతూ, మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వ్యాపారంలో మంచి గుర్తింపు సంపాదించుకుంటూ ముందుకు సాగాలని సల్మాన్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 10(సింగిడి): జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ వెంకటాచారి,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, తహసిల్దార్ లక్ష్మీనారాయణ,సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎడిటోరియల్

Editorial

తెలంగాణ అంటేనే ‘బతుకమ్మ’ పండుగ

(10 – 18 అక్టోబరు “బతుకమ్మ పండుగ” శుభ సందర్భంగా)

తెలంగాణ అంటే బతుకమ్మ (బతుకు = జీవితం, అమ్మ = స్త్రీ లేదా తల్లి). బతుకమ్మ అంటే తెలంగాణ. బతుకమ్మ అంటే తల్లి దేవత సజీవంగా వస్తుందని, జీవిత దాత అని అభివర్ణిస్తారు. స్త్రీత్వానికి పోషక దేవతగా గౌరీ దేవిని ఆరాధిస్తారు. మహిళాలోకా ఇష్ట దైవమైన ‘గౌరి (పార్వతి) అమ్మ’ వారిని ఆటపాటలతో కొలుచుకునే పూల పండుగగా బతుకమ్మకు పేరుంది. ఊరు, వాడ ఆడపడుచులు అందరూ ఎక్కచోట చేరి పూల బతుకమ్మలను మధ్యలో అమర్చి వాటి చుట్టు చేరి సాంప్రదాయ పద్ధతుల్లో పాటలు పాడుకుంటూ, నాట్యాలు చేస్తూ, బతుకమ్మ పండుగను వైభవోపేతంగా జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీక. ప్రకృతి అందాలను ఆరాధిస్తూ, పుడమి చల్లి విశిష్టతను కీర్తిస్తూ, ఆనందాల తోరణాలను కట్టి, పడుచులంతా ఒక్కచోట చేరి జరుపుకునే 9 రోజులు జరుపుకునే పండుగగా బతుకమ్మకు గుర్తింపు ఉన్నది. ప్రకృతి సిద్ధంగా తెలంగాణ ప్రాంతాల్లో లభించే అందమైన, రంగు రంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చుతారు. చెలకలు, చేనుల్లో మొలిచే సహజ పువ్వులైన తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల పూలు, సీత జడ పూలు లాంటివి సేకరించి బతుకమ్మలను పేర్చి మధ్యలో గుమ్మడి పూవ్వును, గౌరమ్మను అమర్చి కొలుచుకుంటారు. తంగేడు పువ్వు శక్తికి, గుమ్మడి పువ్వు మంగళకరమైన సౌందర్యానికి ప్రతీకలుగా తీసుకుంటారు.

తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు:

బతుకమ్మ అంటే బతకనిచ్చే చల్లని అమ్మ అని అర్థం చేసుకోవాలి. ప్రతి ఏట మహాలయా అమావాస్య (పెత్రామాస లేదా పితృ అమావాస్య) రోజున 10 అక్టోబర్ 2026 ‘ఎంగిలి పూల బతుకమ్మ’తో మొదలై తొమ్మిదవ రోజు 18 అక్టోబర్ 2026న ‘సద్దుల బతుకమ్మ’తో ముగుస్తుంది. బతుకమ్మపై అమర్చిన పసుపుతో చేసిన గౌరమ్మను మహిళలు తమ మంగళ సూత్రాలకు పెట్టుకొని దీర్ఘసుమంగళిగా ఉండాలని అమ్మ వారిని కోరుకుంటారు. తీరొక్క పూలతో చేసిన పెద్ద పెద్ద బతుకమ్మలను సమీప చెరువు వద్దకు చేర్చి, వలయాకారంలో నిలబడి, నెమ్మదిగా లయబద్ధంగా కదులుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, ఆటపాటలతో సంబరాలు చేసుకుంటారు. చివరకు సమీప చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేసి ప్రసాదాలు పంచి పెడతారు. ప్రతి రోజు ఒక నైవేద్యాన్ని తయారు చేసి దేవతకు సమర్పిస్తారు. 10 అక్టోబర్ 2026 రోజున ‘ఎంగిలి పూల బతుకమ్మ’తో ప్రారంభమైన తొమ్మిది రోజుల పాటు ‘అటుకుల బతుకమ్మ’, ‘ముద్దపప్పు బతుకమ్మ’, ‘నానే బియ్యం బతుకమ్మ’, ‘అట్ల బతుకమ్మ’, ‘అలిగిన బతుకమ్మ’, ‘వేపకాయల బతుకమ్మ’, ‘వెన్న ముద్దల బతుకమ్మ’, 18 అక్టోబర్ రోజున ‘సద్దుల లేదా పెద్ద బతుకమ్మ’ పండుగలను నిర్వహించుకుంటారు.

బతుకమ్మ పర్వదిన చారిత్రక నేపథ్యం:

బతుకమ్మ పండుగ ప్రారంభ నేపథ్యం అతి పురాతనమైనది. ధర్మాంగుడు అనే రాజుకు వంద సంతానం కలిగిన పుట్టిన తర్వాత చని పోతుంటారు. దుఃఖంలో మునిగిన రాజు దంపతులకు లక్ష్మీ దేవి రూపంలో వందవ సంతానంగా ఆడ బిడ్డ జన్మిస్తుంది. ఆ చిన్నారి పలు అనారోగ్యాలను జయిస్తూ, మునుల నుంచి ‘నవ్వు కలకాలం బతుకమ్మ’ అంటూ దివించబడుతుంది. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన పర్వదినాలుగా ‘బతుకమ్మ’ పండుగను జరుపుకుంటున్నారు. పూల రంగుల మేళవింపుతో ప్రతి ప్రాంతం బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది. బతుకమ్మ పాటల్లో పల్లె అందాలు, ప్రకృతి పట్ల మమకారాలు, పంట చేల పట్ల ఆరాదణలు స్పష్టంగా కనిపిస్తాయి. బతుకమ్మ పాటల్లో పల్లెతనం, అమాయకత్వం, ఒక ప్రకృతి ఆరాధన, ఒక కథ, ఒక సంస్కృతి, ఒక ఆశ, ఒక స్ఫూర్తి దాగి ఉంటాయి. బతుకమ్మ పండుగకు ముందు ఏడు రోజుల పాటు బొడ్డెమ్మ పండుగ జరుపుకుంటాం.

పువ్వులు విరివిగా వికసించే కాలం, చెరువులు నిండు గర్భిణిలుగా కనిపించే కాలంలో వచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన గీతికగా, సంస్కృతిక ప్రతీకగా నిలుస్తున్నది. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా పూల బతుకమ్మ సదా నిలుస్తున్నది, అందరి ఆనంద ఆరోగ్యాలకు కారణం అవుతున్నది నేలతో నీటితో మానవులకు ఉన్న అనుబంధాన్ని బతుకమ్మ చాటుతున్నది.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారత లో ఫుడ్ సెక్యూరిటీకి అదనపు తోడు... హార్టికల్చర్ రంగం



భారతదేశంలోని ఆహార భద్రతకు అదనపు తోడుగా హార్టికల్చర్ రంగం నేడు ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. హార్టికల్చర్ అనగా పండ్లు కూరగాయలు పూల తోటల పెంపకాన్ని సూచించే ఒక నూతన వ్యవసాయక రంగం. మానవునికి ఉపయోగపడే ఆహార పోషక పదార్థాలైన విటమిన్లు, లవణాలు, మాంసకృత్తులు, పిండి పదార్థాలను కలిగి ఉన్న పండ్లు కూరగాయల ఉత్పత్తికి చాలా ప్రాధాన్యత ఉంది. వీటిని రక్షిత ఆహార పదార్థాలుగా వివరించవచ్చు. (ప్రొటెక్టివ్ ఫుడ్స్) మానవుల ఆరోగ్యం సంతోషాలను పెంపొందించే హార్టికల్చర్ పంటలు దేశాభివృద్ధికి తోడ్పడుతున్నాయని ప్రపంచ దేశాలన్నీ గుర్తించి వాటి పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

భారత్ లో హార్టికల్చర్ పరిస్థితులు: భారతదేశంలో విభిన్న వ్యవసాయ వాతావరణ పరిస్థితులు పండ్లు కూరగాయల పెంపకానికి చాలా అనుకూలిస్తాయి. ఏడవ పంచవర్ష ప్రణాళిక కాలం వరకు పండ్లు కూరగాయల రంగానికి తగిన గుర్తింపు రాలేదు. హార్టికల్చర్ రంగానికి నాలుగో పంచవర్ష ప్రణాళికలలో విడిగా కేటాయింపులు ప్రారంభమైనా దానికి తగినంత ప్రాధాన్యత లభించలేదు.

దేశంలో హార్టికల్చర్ రంగం :భారతదేశం హార్టికల్చర్ రంగంలో ఉత్పత్తిలో బ్రెజిల్ చైనా దేశాల తర్వాత స్థానంలో ఉంది. అయితే మన దేశంలో హార్టికల్చర్ పంటల ఉత్పత్తి పెంచడానికి ప్రభుత్వం కొన్ని ప్రత్యేక చర్యలను ప్రోత్సహించింది. పండ్ల తోటలు పెంచే ప్రాంతాలలోని రైతునాడు సహకార పద్ధతిలో నర్సరీలు పెంచి తెగుళ్ళను నియంత్రించి మార్కెట్ సౌకర్యాలు కల్పించింది. సహకార పద్ధతులు పట్టణ శివారులో పండ్ల కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించి మార్కెటింగ్ చేయడం నేర్పించింది. ఉత్పత్తి చేసిన పండ్ల కూరగాయల నిల్వకు శీతల గిడ్డంగులను ఏర్పరిచింది.



ప్రభుత్వ చర్యలు :హార్టికల్చర్ పంటల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వ సహకార శాఖ అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసింది. జాతీయ హార్టికల్చర్ మిషన్ ను స్థాపించింది. ఈశాన్య రాష్ట్రాలలో హార్టికల్చర్ సంఘటిత అభివృద్ధికి టెక్నాలజీ మిషన్ ను స్థాపించింది. జాతీయ హార్టికల్చర్ బోర్డు ద్వారా మూలధన పెట్టుబడి సబ్సిడీ అందించడం టెక్నాలజీ మిషన్ ద్వారా సంఘటితంగా కొబ్బరి తోటల అభివృద్ధి చేయడం లాంటి చర్యలు హార్టికల్చర్ అభివృద్ధికి చాలా ఉపయోగపడ్డాయి.

కేంద్ర ప్రభుత్వ చర్యలు: సూక్ష్మ వ్యవసాయం జాతీయ విధులు మిషన్ నాగాలాండ్ లో కేంద్రీయ హార్టికల్చర్ సంస్థలు స్థాపించడం ద్వారా హార్టికల్చర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు ప్రారంభించింది. ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ 2005లో ఆమోదించిన జాతీయ హార్టికల్చర్ మిషన్ 2005 మరియు 2006 నుండి పనిచేయడం ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో సూక్ష్మ సాగు పథకం నీటి వాడకాన్ని కనిష్టం చేసే బిందు సేద్యం విధానాన్ని దేశమంతా ప్రవేశపెట్టారు. ఈశాన్య రాష్ట్రాలైన సిక్కిం, జమ్ము కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ లలో ఈ పథకాన్ని కొనసాగించి 845 కోట్ల వ్యయంతో 11 రాష్ట్రాలలో హార్టికల్చర్ పంటల అభివృద్ధి పథకాలు చేపట్టారు. ఈ పథకాల అమలులో సహాయం చేయడానికి చిన్న కారు రైతుల వ్యవసాయ వ్యాపార కన్సార్టియం కూడా సహకరించింది. జాతీయ స్థాయి సంస్థలైన జాతీయ హార్టికల్చర్ పరిశోధన అభివృద్ధి ఫౌండేషన్ జాతీయ విత్తన సంస్థ మరియు భారతదేశ రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ ద్వారా కూరగాయల విత్తనాల నాణ్యతను పెంపొందించి కూరగాయల ఉత్పత్తికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో :2006 మరియు 2007 వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రాష్ట్ర హార్టికల్చరల్ మిషన్లకు జాతీయ సంస్థలు అనేక నిధులను కేటాయించాయి. ఈ విధంగా 11 వ పంచవర్ష ప్రణాళిక కాలంలో జాతీయ హార్టికల్చర్ మిషన్ ద్వారా 18 రాష్ట్రాల్లో మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో సంపూర్ణ హార్టికల్చర్ అభివృద్ధి పనులు చేపట్టారు. దేశంలో 16. 7 లక్షల హెక్టార్ల భూమి పండ్ల కూరగాయల పెంపకం కిందికి తెచ్చారు. నేషనల్ సెంటర్ ఫర్ కోల్డ్ చైన్ డెవలప్మెంట్ ను స్థాపించి కోల్డ్ చైన్ నెట్వర్క్ ని విస్తరించారు. ఈ విధంగా భారత దేశంలో దినసరి తలసరి పండ్ల కూరగాయల లభ్యత మరియు ఉత్పత్తి పెంపుదలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తుండగా ప్రస్తుతం హార్టికల్చర్ రంగం తెలంగాణలో హార్టికల్చర్ రంగం ప్రస్తుతం ప్రభుత్వ సహకారంతో హర్టికల్చర్ యూనివర్సిటీల పరిశోధనలతో తెలంగాణలో హార్టికల్చర్ రంగం వేగంగా దూసుకెళ్తుంది అనడంలో సందేహం లేదు.

పందిరి శ్రీనివాసులు: ఎంఏ (జాగ్రఫీ), బిఈడి, ఎంసీజే (జర్నలిజం) పిజిడిసిజే (జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.



తెలుగుపాటకు పట్టుచీర కట్టిన స్వరకర్త సాలూరు రాజేశ్వరరావు

నేడు సాలూరు రాజేశ్వరరావు జయంతి

తెలుగు చలనచిత్ర సంగీత చరిత్రను పరిశీలిస్తే కొన్ని తరాలు మాత్రమే వినగలిగే పాటలు కొన్ని కనిపిస్తే, కాలాతీతంగా తరతరాల హృదయాలను పరవశింపజేసే గీతాలు మరికొన్ని దర్శనమిస్తాయి. వినగానే చెవులను మాత్రమే తాకి కనుమరుగైపోయే బాణీలు వేరు, అంతరంగపు లోతుల్లోకి ఇంకిపోయి ఆత్మను స్పృశించే మధుర స్వరాలు వేరు. భారతీయ సంప్రదాయ శాస్త్రీయ సంగీతంలోని గంభీరమైన రససిద్ధిని, పల్లె పదాల జానపద సహజ సుగంధాన్ని, లలిత గీతాలలోని నిర్మలమైన భావమాధుర్యాన్ని ఒకే తీగపై మేళవించి తెలుగు జాతికి అపురూపమైన అమృతభాండారాన్ని అందించిన అపర వాగ్గేయకారుడు సాలూరు రాజేశ్వరరావు. చలనచిత్రంలో పాట అనేది కేవలం సన్నివేశ మార్పుల కోసమో, కాలక్షేపం కోసమో కాకుండా, కథాగమనానికి శ్వాసగా మారి పాత్రల అంతర్మథనానికి ప్రాణం పోయగలదని తన అసమాన ప్రతిభతో లోకానికి నిరూపించిన యుగపురుషుడు ఆయన. 1922 అక్టోబరు 11న జన్మించిన ప్రతిభా మూర్తి, సంగీత గగనంలో ధ్రువతారగా వెలసిన రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఆయన సినీ స్వర ప్రస్థానాన్ని సమగ్రంగా సింహావలోకనం చేసుకోవడం తెలుగు సాంస్కృతిక వైభవానికి హృదయపూర్వక నివాళి అర్పించడమే అవుతుంది.



ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర ప్రాంతం, కళల పురిటిగడ్డ అయిన విజయనగరం జిల్లా సాలూరు సమీపంలోని శివరామపురం ఆయన జన్మస్థలం. సంగీతం శ్వాసగా మారిన సాంప్రదాయక కుటుంబంలో జన్మించడం రాజేశ్వరరావుకు ప్రకృతి ప్రసాదించిన వరం. తండ్రి సాలూరు సన్యాసిరాజు అసాధారణ మృదంగ విద్వాంసుడు. నాదబ్రహ్మ ద్వారం వెంకటస్వామినాయుడు వంటి సంగీత ఉద్దండుల వయొలిన్ కచేరీలకు మృదంగ సహకారం అందించిన సంగీత విజ్ఞాని ఆయన. తండ్రి ఒడిలోనే లయజ్ఞానాన్ని, రాగ పరిజ్ఞానాన్ని ఔపోసన పట్టిన రాజేశ్వరరావు నాలుగో ఏటనే లయబద్ధంగా తాళం వేస్తూ బాలమేధావిగా ఆశ్చర్యపరిచారు. బాల్యంలోనే వేదికలపై హార్మోనియం, తబలాలతో విన్యాసాలు చేస్తూ పండితుల ప్రశంసలు అందుకున్నారు. ఆయనలోని నాద ప్రతిభను గుర్తించిన నిర్మాతలు పి.వి. దాస్, గూడవల్లి రామబ్రహ్మం ఆయనను మద్రాసు బాట పట్టించారు. అలా 1934 ప్రాంతంలో గ్రామఫోన్ రికార్డింగుల ద్వారా తన గళాన్ని వినిపించిన రాజేశ్వరరావు, 1935లో విడుదలైన ‘శ్రీకృష్ణ లీలలు’ చిత్రంలో బాలకృష్ణుడిగా నటించి, స్వయంగా పాటలు పాడుతూ రంగప్రవేశం చేశారు. ఆ తరువాత ‘మాయాబజార్’ (1936)లో అభిమన్యుడిగా మెప్పించారు. అనంతరం కోల్‌కతా వెళ్లి కె.ఎల్. సైగల్, పంకజ్ మల్లిక్ వంటి మహామహుల సాంగత్యంలో హిందూస్తానీ సంగీతంలోని గీతాత్మక సొబగులను, బేహాగ్, పహాడీ వంటి రాగాల తాజాదనాన్ని ఒంటబట్టించుకున్నారు.

నటుడిగా, గాయకుడిగా ప్రస్థానం మొదలైనప్పటికీ ఆయన అంతరంగం మాత్రం స్వరకల్పన వైపే పరిగెత్తింది. 1939లో వచ్చిన ‘జయప్రద’ చిత్రంతో ఆయన సంపూర్ణ సంగీత దర్శకుడిగా అవతరించారు. ఆ తర్వాత వచ్చిన ‘ఇల్లాలు’ (1940)తో తెలుగు లలిత సంగీత విప్లవానికి నాంది పలికారు. 1940వ దశకంలో దక్షిణ భారత సినీ పీఠభూమి అయిన మద్రాసులో అడుగుపెట్టిన ఆయన, ప్రతిష్టాత్మక జెమిని స్టూడియోస్‌లో సుమారు పదేళ్లపాటు ఆస్థాన స్వరకర్తగా సేవలందించి సంస్థకు సంగీత మూలస్తంభంగా నిలిచారు. ఆ కాలంలోనే వాద్య సమీకరణ, పాశ్చాత్య బృందగాన రీతులు (ఆర్కెస్ట్రేషన్), భారతీయ రాగాల కలయికపై అపూర్వమైన పరిశోధనలు చేశారు. 1948లో విడుదలైన బహుభాషా దృశ్య కావ్యం ‘చంద్రలేఖ’లో ఎమ్.డి. పార్థసారథితో కలిసి ఆయన సమకూర్చిన నేపథ్య సంగీతం, డ్రమ్ డాన్స్ స్వరాలు భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే విప్లవాత్మక మలుపుగా చరిత్రలో నిలిచిపోయాయి.

సాలూరు రాజేశ్వరరావు కళాజీవితంలో శిఖరాయమానమైన ఘట్టం 1951లో బి.ఎన్. రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ‘మల్లీశ్వరి’. ఈ చిత్రంతో తెలుగు సినీ సంగీతం ప్రపంచ స్థాయికి ఎదిగింది. రాయల కాలపు శృంగార, సాహిత్య, లలిత కళల వైభవాన్ని ప్రతిబింబిస్తూ దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన అక్షరాలకు రాజేశ్వరరావు అమర్చిన బాణీలు అమర గీతాలుగా మారాయి. ‘మనసున మల్లెల మాలలూగెనె’, ‘పిలచిన బిగువటరా’, ‘ఆకాశవీధిలో హాయిగా ఎగిరే పావురమా’ వంటి గీతాలు తెలుగు వారి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయి. పదంలోని భావాన్ని, అక్షరంలోని కవిత్వపు లోతును గ్రహించి, దానికి సరిపోయే రాగాన్ని ఎంపిక చేసుకోవడం ఆయనకే చెల్లింది. ఆ తరువాత వచ్చిన భరణీ వారి ‘విప్రనారాయణ’ (1954) భక్తి, శృంగార రసాల సమ్మేళనానికి సంగీత దర్పణంగా నిలిచింది. ‘చూడుమదే చెలియా’, ‘పాలించర రంగా’ వంటి గీతాలు కర్ణాటక శాస్త్రీయ సంగీత సౌరభాన్ని సినిమా పాటకు ఎలా అద్దవచ్చో చాటిచెప్పాయి. ఇక 1955లో వచ్చిన విజయా వారి ‘మిస్సమ్మ’ తెలుగు సినిమా సంగీత చరిత్రలోనే ఒక తేనెవాక. ‘రావోయి చందమామ’, ‘బృందావనమది అందరిది’, ‘ఆడువారి మాటలకు అర్థాలే వేరులే’ వంటి గీతాలు హాస్యం, అమాయకత్వం, ప్రేమ, శృంగార భావాలను వెండితెరపై నర్తింపజేశాయి. ఈ సినిమాను హిందీలో హేమంత్ కుమార్ సంగీత సారథ్యంలో ‘మిస్ మేరీ’గా పునర్నిర్మించినప్పుడు, రాజేశ్వరరావు బాణీలలోని తిరుగులేని మాధుర్యాన్ని యథాతథంగా స్వీకరించాల్సి రావడం ఆయన ప్రతిభకు జాతీయ స్థాయి నిదర్శనం.

రాజేశ్వరరావు సంగీతంలోని అసలైన అంతస్సూత్రం ఆయనకు కర్ణాటక, హిందూస్తానీ రాగాలపై ఉన్న అఖండ పాండిత్యం. కల్యాణి, కాంభోజి, అభేరి, సింధుభైరవి, కాఫీ, మోహన, హిందోళం, శుద్ధధన్యాసి వంటి రాగాలను ఆయన సినిమా సన్నివేశానికి అవసరమైన రీతిలో మలిచారు. శాస్త్రీయ సంగీతంలోని క్లిష్టమైన గమకాలను సామాన్య పామరుడి సైతం సులువుగా పాడుకోగలిగేంత లలితంగా తీర్చిదిద్దడం ఆయన ప్రత్యేక శైలి. మరోవైపు, ‘భలే రాముడు’ (1956), ‘చెంచు లక్ష్మి’ (1958), ‘అప్పు చేసి పప్పు కూడు’ (1959), ‘ఇద్దరు మిత్రులు’ (1961), ‘భార్యాభర్తలు’ (1961), ‘ఆరాధన’ (1962), ‘చదువుకున్న అమ్మాయిలు’ (1963), ‘డాక్టర్ చక్రవర్తి’ (1964), ‘ఆత్మగౌరవం’ (1966), ‘పూలరంగడు’ (1967) వంటి చిత్రాల ద్వారా సాంఘిక చిత్రాల్లోనూ ఆయన సృష్టించిన బాణీలు నిత్యనూతనంగా నిలిచాయి. వాద్యాల అమరికలో ఆయన చూపిన మితభాష్యం ఒక పాఠం. వందల వాద్యాలను గుమ్మరించి శబ్దం చేయడమే గొప్పతనం కాదని, ఒక్క వేణువు నాదంతో, ఒకే ఒక్క సితార్ లేదా మాండలిన్ మీటుతో వేయి భావాలను పలికించవచ్చని ఆయన నిరూపించారు. ఆయన ప్రభావం తెలుగుకే పరిమితం కాలేదు; తమిళం, కన్నడ భాషల్లోనూ వందకు పైగా చిత్రాలకు సంగీతం సమకూర్చి దక్షిణ భారత సంగీత సామ్రాజ్య చక్రవర్తిగా వెలుగొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా నియమితులైన సమయంలో తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలకు ఆయన స్వరకల్పన చేసి భక్తి లోకానికి పరమామృతాన్ని పంచారు. ఆయన సంగీత సేవలను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం 1979లో గౌరవ డాక్టరేట్‌తో పాటు ‘కళాప్రపూర్ణ’ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. తమిళనాడు ప్రభుత్వం నుంచి ‘కలైమామణి’, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ‘శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి మహత్యం’ (1980) చిత్రానికి ఉత్తమ సంగీత దర్శకుడిగా నంది పురస్కారం, మరియు 1992లో జీవిత సాఫల్య గౌరవంగా ‘రఘుపతి వెంకయ్య పురస్కారం’ ఆయనను వరించాయి. 1981లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆహ్వానం మేరకు అమెరికా పర్యటించి ప్రవాసాంధ్రులను తన సంగీతంతో ముంచెత్తారు. భారత ప్రభుత్వం సైతం భారతీయ సినీ సంగీతానికి ఆయన చేసిన సేవలను స్మరిస్తూ 2018 అక్టోబరు 10న ప్రత్యేక స్మారక తపాలా బిళ్లను విడుదల చేసి సముచితంగా గౌరవించింది.

ఆయన కుటుంబం కూడా సంగీత వారసత్వాన్ని కొనసాగించింది. ధర్మపత్ని రాజేశ్వరీదేవితో కలిసి నిరాడంబర జీవితం గడిపిన ఆయనకు ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. కుమారుడు కోటేశ్వరరావు (‘కోటి’గా ప్రసిద్ధుడు) టాలీవుడ్‌లో అగ్రశ్రేణి సంగీత దర్శకుడిగా తండ్రి పేరును నిలబెట్టగా, ఇతర కుమారులు వాద్య సంగీతంలో తమదైన ముద్ర వేశారు. అన్న సాలూరు హనుమంతరావు కూడా గొప్ప స్వరకర్తగా సినీ రంగానికి సేవలందించారు. 1999 అక్టోబరు 25న సాలూరు రాజేశ్వరరావు భౌతికంగా ఈ లోకం విడిచి వెళ్లినా, ఆయన స్వరాలు తెలుగువారి నిత్యజీవితంలో శ్వాసగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆధునిక యుగంలో ఎన్ని రకాల ఎలక్ట్రానిక్ శబ్దాలు, బీట్లు పుట్టుకొచ్చినా, రాజేశ్వరరావు నాదం ఇచ్చే ప్రశాంతత, ఆధ్యాత్మిక భావన, రసానందం మరెక్కడా లభించవు. తెలుగు పాటకు శాస్త్రీయతను గౌరవంగా తొడిగి, సాహిత్యాన్ని సమున్నతంగా నిలిపిన ఆ స్వర సామ్రాజ్య సార్వభౌముడు తెలుగు సంస్కృతి ఉన్నంతవరకు చిరంజీవిగా వెలుగొందుతూనే ఉంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్...9440595494

బతుకునీయవే బతుకమ్మ

గౌరీ దేవి దివ్య ఆదరువు
బతుకునిచ్చే ప్రేమ చెరువు
పల్లెలో పువ్వుల కొలువు
రంగుల సింగడి నెలవు
ఆనందోత్సాహాల తావు
లేదెపుడూ పూలకు కరువు
స్త్రీత్వం ఉట్టిపడే బతుకమ్మలు !

బతుకమ్మ చుట్టు పట్టు చీరలు
తంగేడు పసుపు పూరేకులు
గూనుగు గుబాళించే రేవులు
సీత జడ పూల చిత్ర విచిత్రాలు
ముద్ద బంతి పూల మురిపాలు
గుమ్మడి పూవ్వుల్లో గౌరమ్మలు
దీర్ఘ సుమంగళీ భవా దీవెనలు !

కోలాటాలు, జనపదాల హోరులు
నిత్య నైవేద్యాల వితరణలు
ఊరు వాడల్లో జోరు ఊరేగింపులు
బతుకమ్మ సంతోషాల విందులు
పూల పండుగ భక్తి ప్రపత్తులు
తెలంగాణ అంతటా పూల జాతరలు
పల్లె పట్నాల్లో బతుకమ్మ సంబరాలు !

బంగారు బతుకునియ్యవే బతుకమ్మ
గుమ్ముల నిండా సిరిసంపదల నియ్యవే
ఆయురారోగ్యాల్ని ప్రసాదించవే మాయమ్మ
తీరొక్క పూల సింగిడి సుగంధాలు చల్లవే
ప్రకృతి సౌందర్యాల్ని ప్రసాదించవే మా తల్లి
పూల గోపురాల గుడికి వందనాలు మాత
అంగిలి పూల నుంచి సద్దుల బతుకమ్మ దాకా..
ఊరు వాడ ఊరేగవే మా ముద్దుల బతుకమ్మ !

మధుపాళీ
9949700037

హరగోపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాంటెస్ట్ రావు పద్మా రెడ్డి

హన్మకొండ, అక్టోబర్ 10(సింగిడి): మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హరగోపాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాంటెస్ట్ రావు పద్మా రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన ఒక సమావేశంలో హిందూ మహిళలను, హిందూ ధర్మాన్ని ఉద్దేశించి అత్యంత దిగజారుడు విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన ప్రొఫెసర్ హరగోపాల్‌పై, అలాగే ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిన కాకతీయ యూనివర్సిటీ అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా పర్యటనకు శుక్రవారం విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారదని రావు పద్మా రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు నేరుగా కలిసి వినతిపత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా రావు పద్మా రెడ్డి మాట్లాడుతూ విద్యానగరంగా ప్రసిద్ధి చెందిన కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో, హక్కుల నేత పేరుతో చలామణి అవుతున్న అర్బన్ నక్సల్ ప్రొఫెసర్ హరగోపాల్ హిందూ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు. సమాజంలో శాంతియుతంగా జీవిస్తున్న మహిళలను, వారి విశ్వాసాలను లక్ష్యంగా చేసుకుని విద్వేషాలు రెచ్చగొట్టడం క్షమించరాని నేరమని ఆమె పేర్కొన్నారు. అలాగే, జ్ఞానానికి, విద్యాబోధనకు కేంద్రంగా ఉండాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయంలో అర్బన్ నక్సల్ భావజాలం ఉన్న వ్యక్తులకు, వివాదాస్పద సభలకు అనుమతులు ఇచ్చి వాతావరణాన్ని విషతుల్యం చేస్తున్న విశ్వవిద్యాలయ అధికారుల తీరుపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ మహిళల గౌరవానికి భంగం కలిగించిన ప్రొఫెసర్ హరగోపాల్‌పై మహిళా కమిషన్ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని, విద్వేషపూరిత కార్యక్రమానికి కేయూ ప్రాంగణాన్ని వేదికగా మార్చేందుకు అనుమతులిచ్చిన సంబంధిత విశ్వవిద్యాలయ అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి అని, మహిళా రక్షణ మరియు గౌరవాన్ని నిలబెట్టే అత్యున్నత వ్యవస్థగా ఉన్న రాష్ట్ర మహిళా కమిషన్ ఈ అంశంపై స్పందించి, తక్షణమే న్యాయం చేస్తుందని ఆశిస్తున్నట్లు శ్రీమతి రావు పద్మా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సంద్ర మధు, తోపుచెర్ల అర్చన మధుసూదన్ రావు, ఆకుల శ్రీకాంత్ పటేల్, నర్మెట్ట శ్రీనివాస్ రావు గౌడ్, తిరుపతి నాయక్, పున్నం వేణు, ఆదిత్య సాయి, పెరుగు సురేష్, ఆడెపు రాజు, జితేందర్, రోకుల సతీష్, చల్ల జైపాల్ రెడ్డి, మరియు హిందూ సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదులో కౌండిన్యగౌడ సంఘం చొరవ

- కోదాడ నియోజకవర్గంలో ముమ్మరంగా నమోదు కార్యక్రమం

కోదాడ, అక్టోబర్ 10(సింగిడి): కౌండిన్య గౌడ సంఘం, కేఎల్ఎన్ యువసేన మిత్రమండలి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ పిలుపు మేరకు రాష్ట్ర ప్రతినిధులు కోదాడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు, పాఠశాలల పద్ద డిగ్రీ పూర్తి చేసిన యువతను, నిరుద్యోగులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. అర్హులైన పట్టభద్రులతో స్వయంగా దరఖాస్తు ఫారాలు నింపించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సహకరిస్తున్నారు. కౌండిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో మూడు జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు



పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు సహాయం అవసరమైన వారు సంఘం ప్రతినిధులను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కారింగుల శ్రీనివాస్ గౌడ్, మద్దికుంట్ల సైదులు, పులి వెంకటేశ్వర్లు, వట్టికూటి శ్రీనివాస్ గౌడ్, బచ్చలకూరి గురువయ్య, బత్తిని సాయి పాల్గొన్నారు.

మహర్షి స్కూల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



చింతపల్లి, అక్టోబర్ 10(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మండల కేంద్రంలోని మహర్షి పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొనగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాధాన్యతను ఈ సందర్భంగా వివరించారు. పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలను నిర్వహించారు. ఇలాంటి పండుగల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు ఐక్యత, సాంస్కృతిక విలువలను తెలియజేయవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహర్షి స్కూల్ వ్యవస్థాపకులు గోవింద్ యాదగిరి, కరస్పాండెంట్ భోగరాజు మధుసూదన్, ప్రిన్సిపాల్ వినీత్ కృష్ణ, కరాటే మాస్టర్ కొండ్రపల్లి సురేష్, దేవరకొండ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి గ్యాస్ పొయ్యి అందించిన ఎంపీడీవో ఝాన్సీ



చింతపల్లి, అక్టోబర్ 10(సింగిడి): అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి, చిన్నారుల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూ ఎంపీడీవో పల్లపు ఝాన్సీ ఆదర్శంగా నిలిచారు. మండలంలోని గడియ గౌరారం గ్రామంలో శుక్రవారం ఒకటవ అంగన్వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పల్లపు ఝాన్సీ, సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ, స్థానిక అంగన్వాడీ కేంద్రానికి గ్యాస్ పొయ్యిని బహూకరించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలు, పుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఆమె చేసిన ఈ సహాయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా చిన్నారులకు అవసరమైన వస్తువులను అందించడం, అంగన్వాడీ కేంద్రానికి గ్యాస్ పొయ్యిని బహూకరించడం పట్ల చిన్నారుల తల్లులు, గ్రామ ప్రజలు ఎంపీడీవో ఝాన్సీని అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు వెంకటమ్మ, ఆయా ప్రసన్న, చిన్నారుల తల్లులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా దశాబ్ది ఉత్సవాలు

కేసీఆర్ కి కృతజ్ఞతాభివందనాలు తెలుపుతూ బైక్ ర్యాలీ, పాలాభిషేకం

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



భూపాలపల్లి, అక్టోబర్ 10(సింగిడి): చిన్న కుగ్రామంగా ఉన్న భూపాలపల్లిని జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా ఏర్పాటు చేసి,జిల్లా అభివృద్ధికి పునాదులు వేసి, పదేళ్ల ప్రస్థానంలో అభివృద్ధి పథంలో నడిపించిన తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రేపు, 10 న ఉదయం 9:30 గంటలకు, భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ నుంచి మెడికల్ కాలేజీ మీదుగా నూతన కలెక్టరేట్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ, అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరుగుతుంది. భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు,ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు

హన్మకొండ, అక్టోబర్ 10(సింగిడి): శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానం అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం హన్మకొండలోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన శుభ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. వేడుకలు ఆదివారం నుండి22-10-2026 గురువారం వరకు అమ్మవారిని వివిధ ఆకృతులతో అలంకరణ చేసి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జ్యోతి ప్రజ్వలన పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు,కూడా చైర్మన్ గుండు సుధారాణి ప్రభాకర్, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు హాజరుకానున్నారు. నిత్య కార్యక్రమాలలో భాగంగా ప్రతిరోజు సుప్రభాత సేవా, అభిషేకము, అలంకరణ, ఉపనిషత్, పారాయణం, చండీ సప్తశతి



హవనము, నవగ్రహ రుద్ర హవనము సాయంకాలము లలిత శాస్త్ర పారాయణం చతుర్వేద స్వస్తి హారతి మంత్రపుష్పం భవద్గీత పారాయణం మొదలైన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు శైలపుత్రి అలంకరణ రెండవ రోజు బ్రహ్మచారిని అలంకరణ మూడవరోజు చంద్రగంటల ఘన నాలుగవ రోజు కూష్మాండి అలంకరణ ఐదవరోజు స్కందమాతాలంకరణ ఉపాంగ లలిత వ్రతం లక్ష పుష్పార్చన ఆరవరోజు కాత్యాయిని అలంకరణ ఏడవ రోజు కాలరాత్రి అలంకరణ ఎనిమిదో రోజు మహాగౌరీ అలంకరణ దుర్గాష్టమి సద్దుల బతుకమ్మ అదే రోజు రాత్రి 12 గంటలకు కాళరాత్రి హవనము 9వ రోజు సిద్ధి రాత్రి ధాత్రి అలంకరణ మహర్నవమి సుహాసిని పూజ మహా పూర్ణాహుతి బుత్విక్ సన్మానము పదో రోజు అపరాధితా దేవి అలంకరణ విజయదశమి దసరా ఆయుధపూజ 21-10-2026 బుధవారం రోజున మహా స్నపనం సాయంకాలం ఆరు గంటలకు రథోత్సవం ఉత్సవమూర్తి ఊరేగింపు 22గురువారం ఉదయం పదిన్నర గంటలకు హనుమద్గిరి పద్మాక్షి దేవి శాంతి కళ్యాణము సాయంత్రము తెప్పోత్సవము పద్మాక్షితటాకం నందు ఈ కార్యక్రమం నిర్వహించ బడును బ్రహ్మశ్రీ నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని గారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడును ప్రెస్ మీట్ లో పాల్గొన్న నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని నీలారపు రాజ్ కుమార్ దేవాలయ అభివృద్ధి కార్యకర్త కనుకుంట్ల రవికుమార్ ప్రచార కార్యదర్శి మునుగోటి రమేష్ దేవాలయ అభివృద్ధి కార్యకర్త గోవర్ధన వెంకటరమణాచారి పాల్గొన్నారు.

ఆలేరులో ఘనంగా మెగా వైద్య శిబిరం

- 180 మందికి వైద్య పరీక్షలు..
- మెరుగైన చికిత్స కోసం 50 మంది ఆసుపత్రికి తరలింపు

ఆలేరు, అక్టోబర్ 10(సింగిడి): ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఆలేరులో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, మెడిసిటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, మెరుగైన వైద్యం అవసరమైన 50 మందిని తదుపరి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజని బాలమణి భాస్కర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి మెగా వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడం ద్వారా అనేకమందికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సేవా కార్యక్రమాల్లో భాగంగా వైద్య సేవలు

రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్,



మెడిసిటి ఆసుపత్రి సమన్వయంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా పలువురికి వైద్య సహాయం అందిందని తెలిపారు. అవసరమైన రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు నిర్వాహకులు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో తమ సంస్థ నిరంతరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. మెగా వైద్య శిబిరంలో 180 మందికి పరీక్షలు నిర్వహించగా, వైద్యుల సూచన మేరకు 50 మందిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు చక్రవర్తి రెడ్డి, మెడిసిటి ఆసుపత్రి యాజమాన్యం, వైద్య బృందం, ఇతర సహకారులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెడిసిటి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్బారావు, కౌన్సిలర్లు బోట్ల సంపత్, జెట్ట నీరజ, సిద్ధులు, మల్లెల సరిత, శ్రీకాంత్, జుకంటి సంపత్, మరియమ్మ, మార్క్, ఎండీ మాస్కోదు సముద్రాల శ్రీనివాస్, వడ్డెమాను నరేందర్, కంతుల శంకర్, ఎగ్గిడి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్ నిర్వాసితులకు పునరావాసం.. 250 మందికి ఇంటి స్థలాల పట్టాలు

- రూ.26.50 కోట్లతో పునరావాస చర్యలు
- ఇందిరమ్మ ఇళ్లకు ప్రత్యేక కోటా కల్పిస్తాం
- ప్రభుత్వ విప్ బిర్ల అయిలయ్య

ఆలేరు, అక్టోబర్ 10(సింగిడి): బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన లప్ప నాయక్ తండా నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. మొత్తం రూ.26.50 కోట్లతో పునరావాస చర్యలు చేపట్టి, 250 ప్లాట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రాంత అభివృద్ధి సాధించడంతోపాటు, వాటి కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు తగిన న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. నిర్వాసితుల సంక్షేమం, పునరావాసానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందకుండా వారికి నివాస వసతి కల్పించి, గౌరవప్రదమైన జీవనం కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లకు ప్రత్యేక కోటా



గతంలో లప్ప నాయక్ తండా వాసులు నష్టపరిహారం కోసం ఉద్యమించిన సమయంలోనూ వారికి మద్దతుగా నిలిచామని అయిలయ్య గుర్తుచేశారు. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నష్టపరిహారంతోపాటు ఇంటి స్థలాలు అందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రత్యేక కోటా కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఇళ్లు నిర్మించిన తర్వాతే తండా ఖాళీ

నిర్వాసితులకు ఇంటి స్థలాలు ఇవ్వడమే కాకుండా, అక్కడ మౌలిక వసతులు కల్పించి తండాను 'మినీ బంజారాహిల్స్' తరహాలో అభివృద్ధి చేస్తామని అయిలయ్య పేర్కొన్నారు. నిర్వాసితులు కొత్త స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాతే ప్రస్తుత తండాను ఖాళీ చేయిస్తామని స్పష్టం చేశారు. తండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పునరావాస ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. తండా అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి పనుల సమయంలో నిర్వాసితుల సంక్షేమాన్ని విస్మరించబోమని, అర్హులైన ప్రతి కుటుంబానికి పునరావాస ఫలాలు అందేలా కృషి చేస్తామని ప్రభుత్వ విప్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లప్ప నాయక్ తండా గ్రామస్థులు పాల్గొన్నారు.

రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టుకు నిరసనగా ఎన్ఎస్‌యూఐ ఆందోళన

అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మల దహనం

రాజీనామా చేయాలని అల్లి అంజన్ యాదవ్ డిమాండ్

నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 10 (సింగిడి): రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యాదవల్లి వెంకటస్వామి పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు అల్లి అంజన్ యాదవ్ నేతృత్వంలో చేపట్టిన ఈ నిరసనలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా అల్లి అంజన్ యాదవ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ), ఓటర్ల జాబితాలో పారదర్శకతపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తమ పదవులకు రాజీనామా చేయాలని అల్లి అంజన్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి బైరు ప్రసాద్ గౌడ్, జిల్లా నాయకులు సాయి తేజ, అనుముల పురి గోయల్, సూర్య, చిట్టిబాబుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూపాలపల్లి లో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత

148 కంపెనీలు 12 వేల ఉద్యోగాలే లక్ష్యం

భూపాలపల్లి, అక్టోబర్ 10(సింగిడి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గార్డెన్స్ లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాబ్ మేళాలో మొత్తం 148 కంపెనీలు ప్రతినిధులు పాల్గొని సుమారు 12 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇంటర్వ్యూలు చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి యువత జాబ్ మేళాకు తరలి రావడంతో జాబ్ మేళా ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రిజిస్ట్రేషన్ ప్రక్రియను, వివిధ స్టాల్స్ ను పరిశీలించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. సాఫ్ట్ వేర్, బ్యాంకింగ్, విమానయాన రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో ప్రదీప్ రెడ్డి, ప్లేస్మెంట్ టీం లీడర్ నితిన్ రెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, డిసిసి అధ్యక్షుడు కరుణాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, జిల్లా అధికారులు,కంపెనీల ప్రతినిధులు,ఉద్యోగ యువత పాల్గొన్నారు.



కాన్షీరాంకు ఎమ్మెల్యే బత్తుల, ఎమ్మెల్సీ శంకర్, దళిత సంఘాల ఘన నివాళులు

మిర్యాలగూడ అక్టోబర్ 10(సింగిడి): బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పి) వ్యవస్థాపకుడు, ప్రముఖ రాజకీయవేత్త, సామాజిక సంస్కర్త కాన్షీరాం 20వ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని నార్కెట్‌పల్లి –అద్దంకి బై పాస్ రోడ్డు వై జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాన్షీరాం బహుజనుల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధించేందుకు ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మునిసిపల్ కౌన్సిలర్లు, వివిధ దళిత సంఘాల నాయకులు కాన్షీరామ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

అనంతగిరి అయ్యప్ప సన్నిధిలో అన్నప్రసాద వితరణ

కోదాడ, అక్టోబర్ 10(సింగిడి): తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధి చెందిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో అన్నప్రసాద వితరణ మూడో రోజు కొనసాగింది. సుమారు 120 మంది స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. దాతలుగా బుర్రా పుల్లారెడ్డి--సుధారాణి, పసుమర్తి హరిప్రకాష్--ప్రత్యూష దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, ఓరుగంటి రమేష్, పోలిశెట్టి నరసింహారావు, అయితనబోయిన వెంకటేశ్వర్లు, ఆనంతుల ఉపేందర్, అయినాల శ్రీను తదితర భక్తులు పాల్గొన్నారు.



అనుబంధాల కలయిక, ఆత్మ గౌరవ ప్రతీక బతుకమ్మ

మిర్యాలగూడ, అక్టోబర్ 10(సింగిడి): మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ సార్ మాట్లాడుతూ బతుకమ్మ మన సంస్కృతి. ఇదొక వారసత్వ పండుగ. చరిత్రకు సాక్ష్యమైన పూల జాతర. నేలను ముద్దాడి, గంగను స్పర్శించి, పుట్ట మన్నును పూజించే తెలంగాణ గట్టుపైన.. పూలను కొలిచే అరుదైన సంప్రదాయం .. బతుకమ్మ. 'బతుకమ్మ సంబురం'లో ఆడబిడ్డ అనురాగం, ఆత్మీయ పలకరింపు కనిపిస్తయి. చీరె.. సారె పెట్టి ఒడిబియ్యం పోసినట్లు తీరొక్క పూలతో అలంకరించగా.. సింగిడి రంగుల్లాంటి ప్రజలను ఒక్కటి చేస్తది బతుకమ్మ. వాడిపోయిన ప్రేమలు బతుకమ్మ వేడుకలో చిగురిస్తయి. బాసిపోయిన బంధాల

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

సిద్ధిపేట బ్యూరో,అక్టోబర్ 10 (సింగిడి): పోలీస్ ఫ్లాగ్ డే--2026 సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీల్లో విద్యార్థులు, యువత, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఈ నెల 21 న పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని అక్టోబర్ నెలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది చేస్తున్న త్యాగాలు, ప్రజల రక్షణ కోసం అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పోషిస్తున్న పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల నివారణలో పౌరులు, పోలీసుల పాత్ర, మాదకద్రవ్యాల వినియోగం నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు అనుసరించాల్సిన మార్గాలు వంటి అంశాలపై పోటీలు పోలీస్ స్టేషన్ వారిగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా



పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.పోలీస్ శాఖకు సంబంధించిన అంశాలపై తెలుగు, ఉర్దూ లేదా ఆంగ్ల భాషల్లో గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి కలిగిన షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించి పోటీల్లో పాల్గొనవచ్చని సిపి తెలిపారు. పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన వంటి అంశాలను ప్రతిబింబించేలా షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించాలని సూచించారు. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ మూడు షార్ట్ ఫిల్మ్‌లను రాష్ట్రస్థాయి ఎంపికకు పంపించనున్నట్లు, ఎంపికైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.పోలీస్ శాఖ విధులు, సేవలు,ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ,ట్రాఫిక్ నిర్వహణ, పోలీస్--ప్రజల సంబంధాలు, విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వంటి అంశాలపై ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సిపి తెలిపారు.ఈ పోటీలకు సమర్పించే ఫోటోలు ఇటీవల తీసినవై ఉండాలని, పోలీస్ శాఖ విధులకు సంబంధించినవై ఉండాలని స్పష్టం చేయడమైనది. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఫోటోలను రాష్ట్రస్థాయి ఎంపికకు పంపించనున్నట్లు, ఎంపికైన ఫోటోగ్రాఫర్లకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపించి, సంబంధిత పోలీస్ పోర్టళ్లలో 2026 ఈ నెల 30 లోగా అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పోటీల్లో పాల్గొనే వారు తమ షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోలను ఈ నెల 20 లోగా సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల ద్వారా పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపించాలని సిపి సూచించారు.విద్యార్థులు, యువత, ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్నవారు, పోలీస్ సిబ్బంది ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శించాలని, సమాజంలో అవగాహన పెంపొందించే సందేశాలను సృజనాత్మకంగా ప్రజలకు చేరవేయాలని ఆమె పిలుపునిచ్చారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం..



చింతపల్లి, అక్టోబర్ 10 (సింగిడి): మానవసేవే మాధవసేవ అన్న స్ఫూర్తితో మండల కేంద్రానికి చెందిన యువకులు ఆదర్శ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం వృద్ధాశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు భోజనం అందించి తమ సేవా నిరతిని చాటుకున్నారు. కొడిదల శ్రీనివాస్ వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్యాన్ని ఆకాంక్షించారు.వృద్ధాప్యంలో ఆప్యాయత, ఆదరణతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని యువకులు పేర్కొన్నారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవభావం పెంపొందించడంతో పాటు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకుల చొరవపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వందనపు ఆంజనేయులు, దాచేపల్లి మధు, వి.కె. శ్రీనివాస్, సముద్రాల నగేష్, చెట్లపల్లి హరిప్రసాద్, విగ్రహాల మనుమదాచారి, కొక్కొండ్ల అరుణ్ కుమార్, ఉప్పల యాదయ్య, ఆకారపు శ్రీకాంత్, చిన్నమోని అంజయ్య, నాళ్ల శివకుమార్, ఎన్నం శేఖర్, గోవింద్ రవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి విజయవంతంగా శస్త్రచికిత్స.. మరో రూ.2 లక్షల సాయం

● పాప చదువు బాధ్యత కూడా నాదే..

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 10 (సింగిడి): మూగ, చెవిటి దంపతుల చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర రోడ్లు. భవనాలు.సినిమా సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రిలో చిన్నారికి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తయింది. ఈ సందర్భంగా ఆసుపత్రికి వెళ్లిన మంత్రి పాపను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చిన్నారి వైద్య ఖర్చుల కోసం ఇప్పటికే రూ. 2 లక్షల ఆర్థికసాయం అందించిన మంత్రి, తాజాగా మరో రూ. 2 లక్షలను కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకునే వరకు అవసరమైన సహకారం అందిస్తానని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.వైద్యుల పర్యవేక్షణతో పాటు స్పీచ్ థెరపీ అందిస్తే చిన్నారి త్వరలోనే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం. చిన్నారి ఆరోగ్యంగా కోలుకోవడమే కాకుండా, భవిష్యత్తులో ఆమె చదువు బాధ్యతను కూడా తానే తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి వైద్యసాయం అందించడంతో పాటు చిన్నారి భవిష్యత్తుకు అండగా నిలుస్తానని భరోసా ఇవ్వడం కుటుంబ సభ్యుల్లో ఆశలు నింపింది.



నగరంలో అంగరంగవైభవంగా బతుకమ్మ వేడుకలు

● ప్రకృతి ప్రసాదించిన పూలతో బతుకమ్మలు

● ఆటపాటలతో మహిళా మణుల సంబరాలు

హన్మకొండ, అక్టోబర్ 10 (సింగిడి): గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రై సిటీలో శనివారం బతుకమ్మ పండగ వేడుకలు అంగరంగ జరిగాయి. ఆశ్వయుజ పితృ అమావాస్య తొలిరోజు నేపద్యంలో హన్మకొండలోని చారిత్రక వేయిస్తంభాల దేవాలయానికి మహిళలు పెద్ద ఎత్తున వేడుకలకు తరలి వచ్చారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో వివిధ ఆకృతులతో పేర్చిన బతుకమ్మలతో దేవాలయాలే వేదికలుగా మహిళలు ఆటపాటలతో గౌరీదేవిని ఆరాధించారు. ఎంగిలిపూల బతుకమ్మతో పండుగకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పాటలు పాడుతూ ఎంగిలిపూల బతుకమ్మకు స్వాగతం పలికారు. అమ్మవారికి నైవేద్యంగా నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి ప్రసాదం తయారు చేసి తమ వెంట తీసుకు వచ్చి పలువురికి పంచిపెట్టారు. సమీపంలో ఉన్న దేవాలయాలు,చెరువుల వద్ద మహిళలంతా గుమికూడి సమిష్టిగా వేడుకలు జరుపుకున్నారు.బతుకమ్మ కేవలం పూల అలంకరణ మాత్రమే కాకుండా తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని,స్త్రీల శక్తిని,ప్రకృతి పట్ల గౌరవాన్ని చాటి చెప్పే ఉత్సవంగా భావించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలను అందరూ కలిసి ఆలపించడం ఆసక్తిని సంతరించుకుంది. ప్రతి రోజు వేర్వేరు పూలతో వివిధ ఆకృతులతో బతుకమ్మలను తయారు చేసి పూజించడంతో పాటు ప్రత్యేకంగా బతుకమ్మ పాటలు పాడుతూ నిర్వహించే వేడుకలు తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది.



యోగా సాధనకు స్థలం కేటాయించాలని

కొలన్ హన్మంత్ రెడ్డికి వినతి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని శనివారం నిజాంపేట్‌కు చెందిన పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, యోగా సాధన, ధ్యానం నిర్వహించేందుకు అనువైన స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గత ఎనిమిదేళ్లుగా నిజాంపేట్‌లో యోగా, ధ్యానం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఎండ, వర్షం, వాహనాల కాలుష్యం, రోడ్డు భద్రత వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. యోగా సాధనకు అనువైన స్థలం కల్పించి తమకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శివ సాయి హిల్స్ యుజుడి సమస్యకు పరిష్కారం, 37 లక్షలు మంజూరు

కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ కమిటీ కృతజ్ఞతలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ మహదేవపురం డివిజన్ శివ సాయి హిల్స్ కాలనీలో గత నాలుగేళ్లుగా స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యు జి డి) సమస్య పరిష్కారం లభించింది. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి 37 లక్షల నిధులు కులను హనుమంత రెడ్డి కృషితో మంజూ--రయ్యాయి.ఈ సమస్యను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లగా, ఆయన సంబంధిత అధికారులతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి, డీఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిశీ లించేలా చొరవ తీసుకున్నారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు పత్రం వచ్చింది. 10 రోజుల క్రితం సాంక్షన్ ఆర్డర్ జారీ కాగా, రాబోయే 15--20 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపినట్లు కాలనీ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా శివ సాయి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులందరూ కొలన్ హన్మంత్ రెడ్డి ని కలిసి, తమ కాలనీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యు జి డి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభం కావడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శివ సాయి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బి.ఆర్.ఎస్ నేత విజయ్ రామిరెడ్డి జన్మదిన వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన

ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంబిపూర్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ మల్లారెడ్డి నగర్ లో గదుల రామారావు డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు డి విజయ్ రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు ఆత్మీయులు అభిమానులు పార్టీ స్థానిక ముఖ్య నేతల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. విజయరామిరెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎమ్మెల్సీ చంబిపూర్ రాజు లను కలిసి వారి ఆశీస్సులు, జన్మదిన శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు విజయ్ రామ్ రెడ్డి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు,





ఆత్మీయులు, అభిమానులు, పార్టీ స్థానిక నేతలందరూ హాజరై శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందించి, కేకులు కట్ చేసి, మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయరామరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో జీవిస్తూ, రానున్న కాలంలో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో మరింత ఉత్తమ పేరు ప్రఖ్యాతలు సాధించాలని, ప్రజల మధ్య మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిన్నారి ప్రాణం తీసిన బంగారు,

వెండి నగలు శుద్ధి చేసే రసాయన పదార్థం

శోకసముద్రంలో మునిగిన చిన్నారి కుటుంబం

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10 (సింగిడి): బంగారు, వెండి పాత నగలను శు భ్రపరిచే రసాయనాలను తిని చిన్నారి మరణించిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. జువెలరీ షాపులో రసాయన పదార్థాలని అబ్బము శుభం తెలియని రెండేళ్ల చిన్నారి తిని ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది.



పోలీసులు వివరాల ప్రకారం ఓ మహిళ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి చింతల్ లోని విష్ణు జువెలరీ షాపులో బంగారం కొనేందుకు తన రెండేళ్ల చిన్నారిని తీసుకొని వెళ్లింది.సదరు మహిళ షాపు యజమానితో బంగారం గురించి మాట్లాడే క్రమంలో చిన్నారి పక్కకు వెళ్లి అక్కడే ఉన్న నగలు మెరుగు పెట్టే కెమికల్ పదార్థాలను నోట్లో పెట్టుకుంది. దీంతో అస్వస్థతకు గురైన ఆ చిన్నారిని కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆ చిన్నారి చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. కండ్ల ముందే విగతజీవిగా మారిపోయిన చిన్నారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్నారి తల్లిదండ్రులు తమకు న్యాయం చేయాలని జువెలరీ షాపు ముందు ఆందోళనకు దిగారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కిసాన్ బంధు సహకారంతో నూతన వస్త్రాలు బహూకరణ



కొడంగల్, అక్టోబర్ 10 (సింగిడి): 2023లో తండ్రి ఆత్మహత్య,గత సెప్టెంబర్ లో తల్లి అనారోగ్యంతో మృతిచెందడంతో సంతానం అనాథలుగా మారిపోయారు. విషయం తెలుసుకున్న తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్ గౌడ్ కిసాన్ బంధు వ్యవస్థాపకులు స్నేహ, నిశాంత్, సతీష్ లకు తెలియజేయగా హృదయం చలించిన కిసాబంధు సంస్థ వారు శనివారం దుద్యాల గ్రామానికి చేరుకుని తల్లిదండ్రులు లేని నలుగురు పిల్లలకు దసరా పండుగకు కొత్త బట్టలు ధరించాలని 7000 రూపాయలతో నూతన వస్త్రాలు కొనిచ్చారు.తల్లిదండ్రులు లేరనే దిగులుతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోరాదని, గొప్ప చదువులు చదువుకోవాలని, చదువుకునేందుకు తమవంతు తోడ్పాటు ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో దుద్యాల ఉపసర్పంచ్, సంజీవ్, ఉపాధ్యాయులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

● బతుకమ్మలను ఒకచోట పేర్చి

వేడుకల్లో పాల్గొన్న మహిళలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లో లావణ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, ఆనందోత్సవాల మధ్య జరిగాయి. ఈ వేడుకల్లో రంగురంగుల పూలతో అలంకరించిన ఎంగిలిపూల బతుకమ్మలను అందంగా అలంకరించి ఒకచోట సమకూర్చి కాలనీలోని మహిళలందరూ సంప్రదాయ దుస్తులను ధరించి ఆనందంగా బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ వేడుకలు జరుపుకున్నారు. వేడుకల అనంతరం ఎంగిలిపూల బతుకమ్మలను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ కొలనులలో ఎంగిలిపూల బతుకమ్మలను నీటిలోకి వదిలి వీడ్కోలు పలికారు. వచ్చే సంవత్సరం వరకు ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించేలా దీవించాలని గౌరమ్మను, ఎంగిలిపూల బతుకమ్మలను మహిళలు వేడుకున్నారు. అనంతరం వివిధ రకాల ఫలహారాలను మహిళలు ఒకరికొకరు పంచుకొని స్నేహపూర్వక వాతావరణం లో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ముగించారు.

క్వారీ గుంతలో పడి... కళాశాల విద్యార్థి మృతి

పిఎస్ లో ఫిర్యాదు చేసిన తల్లి

జవహర్ నగర్, అక్టోబర్ 10 (సింగిడి): ఓ క్వారీ గుంతలో పడి కళాశాల విద్యార్థి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం.... ముమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17) తన తల్లితో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో నివసిస్తున్నారు. ప్రణవ్ సాయి నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటిలాగే ఈనెల తొమ్మిదో తారీఖున ఉదయం కళాశాలకు వెళ్ళాడు. తిరిగి అదే రోజు సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ప్రణవ్ సాయి అతని స్నేహితులు మల్కారం క్వారీలో ఈత కొట్టడానికి వెళ్లారని, ప్రణవ్ సాయి స్నేహితులు పోలీసులు ఫోన్ చేసి ప్రణవ సాయి క్వారీలోని నీటిలో ఈత కొడుతూ మునిగి పోయాడని సమాచారం ఇచ్చారు. వెంటనే ముమ్మారెడ్డి హేమలత సంఘటనా స్థలానికి చేరుకొని తన కుమారుడి స్నేహితులను విచారించగా వారందరూ కలిసి ఈత కొట్టడానికి వెళ్ళామని ఈత కొడుతున్న సమయంలో నీటిలో మునిగిపోయాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు, డిఆర్ఎఫ్ బృందాల సహాయంతో క్వారీ



గుంతలోని నీటిలో నుండి ప్రణవసాయి మృతదేహాన్ని బయటకి తీశారు. అప్పటికే ప్రణవసాయి మరణించట్లు గుర్తించారు. ఈ మేరకు హేమలత ఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వికారాబాద్ జిల్లా బెన్నారులో విషాదం

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 10(సింగిడి): వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం బెన్నారు గ్రామానికి చెందిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ అలియాస్(చందు) పిల్లల చదువు కోసం హైదరాబాద్ లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో సాఫిగా సాగుతున్న వారి కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బెన్నారుకు చెందిన చంద్రశేఖర్ గౌడ్ తనయుడు అఖిల్ (20) రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అఖిల్ ఉదయం జిమ్ కు వెళ్ళి తిరిగి ఇంటికి సూటిపై వెళుతున్న సమయంలో సిలిండర్ లోడ్ తో వెళుతున్న లారీ స్కూటీ ఢీ కొనడంతో కిందపడిపోయిన అఖిల్ పై నుండి లారీ వెనకచక్రాలు ఆయనపై నుండి వెళ్లడంతో ఆయన అక్కడికి అక్కడే ప్రాణాలు వదిలాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఏకైక కుమారుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. దీంతో స్వగ్రామం బెన్నారులో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.



అంబేద్కర్ సార్వత్రిక విద్యకు సువర్ణ అవకాశం

డిగ్రీ ప్రవేశాలకు అక్టోబర్ 13 చివరి తేదీ

సిఆర్‌పిఎఫ్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కె. హరి శంకర్

జవహర్ నగర్, అక్టోబర్ 10 (సింగిడి): ఉన్నత చదువుల అభ్యసనానికి దూరవిద్య కేంద్రం (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) బిఆర్ఏ ఓయూ కేంద్రం ద్వారా సిఆర్పిఎఫ్ క్యాంపస్ చక్కని సువర్ణ అవకాశం కల్పిస్తుందని అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సిఆర్పిఎఫ్ పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కే .హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026 ఇంకా 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి కోర్సులైన బిఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఈనెల 13వ తేదీ చివరి తేదీ అని వైస్ ప్రిన్సిపల్ కే. హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వివరాల కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981837962 లేదా 99590 344 77 నెంబర్లను సంప్రదించాలన్నారు.



మొటిమలకు ఈ ఆకుల నీరు..

నిజంగా పనిచేస్తుందా?

సహజమైన పదార్థం కాబట్టి ప్రతి ఒక్కరికీ సురక్షితంగా పనిచేస్తుందని అనుకోవడం సరికాదు. వేపలోని కొన్ని పదార్థాలపై సూక్ష్మజీవులు, వాపు వంటి అంశాలకు సంబంధించి పరిశోధనలు జరిగినప్పటికీ, ఇంట్లో తయారు చేసిన వేప నీరు మొటిమలను నయం చేస్తుందని లేదా నల్ల మచ్చలను తొలగిస్తుందని చెప్పడానికి బలమైన ఆధారాలు లేవు. ఈ చిట్కాను ప్రయత్నించాలనుకునేవారు దాన్ని ఎలా తయారు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేది తెలుసుకోవాలి.



1. వేప నీటిని ఎలా తయారు చేసుకోవాలి?

వేప నీటిని ప్రయత్నించాలనుకుంటే ముందుగా కొన్ని తాజా వేప ఆకులను శుభ్రమైన నీటితో బాగా కడగాలి. వాటిని శుభ్రమైన పాత్రలో నీటితో కలిపి కొద్దిసేపు మరిగించి, ఆ నీటిని పూర్తిగా చల్లార్చాలి. అనంతరం ఆకులను వడకట్టి నీటిని వేరుగా తీసుకోవచ్చు. తయారు చేసిన నీటిని శుభ్రమైన పాత్రలో ఉంచి ఫ్రిజ్‌లో నిల్వ చేయాలి. ఇంట్లో తయారు చేసిన ఈ నీటికి నిర్ధారిత నిల్వ కాలం ఉండదు కాబట్టి ఎక్కువ రోజులు ఉంచకుండా, వీలైతే అదే రోజు ఉపయోగించడం మంచిది. వాసన, రంగు మారినా లేదా నీరు కలుషితమైందని అనిపించినా ఉపయోగించకూడదు. తులసి వంటి ఇతర ఆకులను కలపడం తప్పనిసరి కాదు.

2. మొటిమలు తగ్గడానికి వేప నీరు ఉపయోగపడుతుందా?

వేపలోని కొన్ని సమ్మేళనాలకు ప్రయోగశాల స్థాయిలో యాంటీమైక్రోబయల్ లక్షణాలు కనిపించినప్పటికీ, వేప నీటితో ముఖం కడుక్కోవడం వల్ల మొటిమలు తగ్గుతాయని నిర్ధారించడానికి తగిన వైద్య ఆధారాలు లేవు. వేపను కలిగి ఉన్న కొన్ని చర్మ సంరక్షణ ఉత్పత్తులపై పరిశోధనలు జరిగినా, వాటి ఫలితాలను ఇంట్లో తయారు చేసిన వేప నీటికి నేరుగా వర్తింపజేయలేం.

మొటిమలు రావడానికి చర్మంలో అధిక నూనె ఉత్పత్తి, రంధ్రాలు మూసుకుపోవడం, వాపు, హార్మోన్ల మార్పులు వంటి అనేక కారణాలు ఉంటాయి. అందువల్ల ఒకే ఇంటి చిట్కా అందరిలోనూ ఒకే ఫలితాన్ని ఇస్తుందని చెప్పలేం.





3. నల్ల మచ్చలు, జిడ్డు చర్మం తగ్గుతాయా?

మొటిమలు తగ్గిన తర్వాత కొన్ని సందర్భాల్లో ముఖంపై నల్ల మచ్చలు మిగిలిపోతాయి. వేప నీటిని వాడితే ఈ మచ్చలు తొలగిపోతాయని లేదా చర్మపు రంగు సమానంగా మారుతుందని నిరూపితమైన ఆధారాలు లేవు. అలాగే జిడ్డు చర్మాన్ని దీర్ఘకాలం నియంత్రిస్తుందని కూడా చెప్పలేం.

చర్మ సంరక్షణలో భాగంగా మృదువైన క్లెన్సర్‌తో రోజుకు రెండుసార్లు ముఖాన్ని శుభ్రం చేసుకోవడం, చర్మానికి సరిపోయే మాయిశ్చరైజర్ వాడటం, బయటకు వెళ్లేటప్పుడు ఎస్‌పీఎఫ్ 30 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న సన్‌స్క్రీన్ ఉపయోగించడం మంచిది. మొటిమలను గిల్లడం లేదా పిండడం వల్ల మచ్చలు, గాయాలు ఏర్పడే అవకాశం పెరుగుతుంది.

4. వేప నీటిని వాడేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

సహజ పదార్థమైనప్పటికీ వేప నీరు కొందరిలో చర్మంపై చికాకు కలిగించవచ్చు. సున్నితమైన చర్మం ఉన్నవారికి ఎర్రదనం, దురద, మంట లేదా పొడిబారడం వంటి సమస్యలు రావచ్చు. ముందుగా చేతి లోపలి భాగంలో చిన్న ప్రదేశంలో పరీక్షించండి. చికాకు వస్తే ముఖానికి ఉపయోగించవద్దు. కళ్లకు, పెదవులకు, తెరిచి ఉన్న గాయాలకు తగలకుండా జాగ్రత్తపడండి. ముఖంపై మంట, దురద లేదా ఎర్రదనం వస్తే వెంటనే కడిగేయండి.

ఇంట్లో తయారు చేసిన నీటిని ఎక్కువసేపు నిల్వ చేయవద్దు.

ఇప్పటికే మొటిమలకు వైద్యుడు సూచించిన మందులు వాడుతుంటే వాటిని ఆపి వేప నీటిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించవద్దు.

5. మొటిమలు ఎక్కువగా ఉంటే ఏం చేయాలి?

మొటిమలు పదేపదే వస్తున్నా, నొప్పితో కూడిన పెద్ద మొటిమలు ఏర్పడుతున్నా లేదా మచ్చలు పడుతున్నా చర్మవ్యాధి నిపుణుడిని సంప్రదించడం మంచిది.

స్టాక్ మార్కెట్ Stock Market

డీమార్ట్ బిజినెస్ సీక్రెట్ ఇదే..

తక్కువ ధరలకు అమ్మినా వేల కోట్ల లాభాలు ఎలా?

హోల్‌సేల్‌గా కొనడం వల్ల కలిగే ప్రయోజనాలు:

తయారీదారుల నుండి నేరుగా, పెద్దమొత్తంలో వస్తువులను కొనుగోలు చేయడమే డి-మార్ట్ అతిపెద్ద వ్యూహం. ఉదాహరణకు ఒక చిన్న దుకాణం కేవలం 100 సబ్బు పెట్టెలను కొనుగోలు చేస్తే, డి-మార్ట్ వంటి పెద్ద సంస్థ వేల పెట్టెలను ఆర్డర్ చేస్తుంది. ఈ పెద్ద ఆర్డర్ కారణంగా తయారీదారులు కంపెనీకి మంచి తగ్గింపును ఇస్తారు.



డి-మార్ట్ వినియోగదారులకు ఉత్పత్తులను ఇంత తక్కువ ధరలకు అందించి ఎలా లాభం సంపాదిస్తుంది? ప్రతి ఉత్పత్తిని అధిక ధరకు అమ్మడం ద్వారా మాత్రమే అది లాభం పొందుతుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆ సంస్థ వ్యాపార వ్యూహంలో ఉన్నాయి. తక్కువ ధరలు, అధిక అమ్మకాలు, ఖర్చులపై పటిష్టమైన నియంత్రణ, వేగవంతమైన సరుకు మార్పిడి దాని విజయానికి పునాదులు.

దీనివల్ల కొనుగోలు ఖర్చు గణనీయంగా తగ్గుతుంది.

ఉదాహరణకు డి-మార్ట్ రూ. 100 కొనుగోలు ధర గల ఒక వస్తువును రూ. 95కు కొని, హోల్‌సేల్ ద్వారా రూ. 98కు అమ్ముతుంది. అయినప్పటికీ, వారికి ప్రతి వస్తువుపై రూ. 3 లాభం వస్తుంది. వినియోగదారుడు కూడా ఆ వస్తువును మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే పొందుతాడు. (ఇది కేవలం అవగాహన కోసం ఇచ్చిన ఉదాహరణ మాత్రమే. కంపెనీ ప్రత్యక్ష లాభాన్ని ఈ విధంగా లెక్కించరు).

తక్కువ లాభం, కానీ అధిక అమ్మకాల గణాంకాలు:

ఒక వస్తువుపై రూ. 10 లాభం సంపాదించడానికి బదులుగా, అదే వస్తువును తక్కువ లాభంతో ఎక్కువ పరిమాణంలో అమ్మితే, మొత్తం లాభం ఎక్కువగా ఉంటుందని ఈ కంపెనీ నిరూపించింది. ఉదాహరణకు మీరు ఒక వస్తువుపై రూ. 5 లాభం పొందుతున్నారనుకుందాం. మీరు ఒక రోజులో 100 వస్తువులు అమ్మితే, మీకు రూ. 500, 1000 వస్తువులు అమ్మితే, రూ. 5,000, 10,000 వస్తువులు అమ్మితే, రూ. 50,000 వస్తాయి. ఇది ఖర్చులకు ముందు వేసిన అంచనా. ఉద్యోగుల జీతాలు, విద్యుత్, రవాణా వంటి ఖర్చులను తీసివేసిన తర్వాత మాత్రమే నికర లాభాన్ని లెక్కిస్తారు.

సరఫరాదారులకు తక్షణ చెల్లింపు

వస్తువులను సరఫరా చేసే తయారీదారులు, పంపిణీదారులు, తమకు వస్తువులు అందిన వెంటనే డబ్బు పొందడం చాలా ముఖ్యం. సరఫరాదారులకు సకాలంలో చెల్లించడం డి-మార్ట్ కొనుగోలు విధానంలో ఒక ముఖ్యమైన భాగమని వ్యాపార నివేదికలు చెబుతున్నాయి.

డబ్బు త్వరగా అందుతుంది. సరఫరాదారులు దానిని ఉత్పత్తిలో తిరిగి పెట్టుబడి పెట్టగలరు. ప్రతిఫలంగా తయారీదారులు పెద్ద ఆర్డర్‌లకు, సకాలంలో చెల్లింపులకు డి-మార్ట్‌కు అదనపు తగ్గింపులను అందిస్తారు. దీనివల్ల ఆ సంస్థ వినియోగదారులకు వస్తువులను తక్కువ ధరలకు అమ్మగలుగుతుంది.

స్టోర్ ఖర్చులపై కఠినమైన నియంత్రణ

సూపర్‌మార్కెట్ వ్యాపారంలో సరుకుల కొనుగోలుతో పాటు, దుకాణం అద్దె, ఉద్యోగుల జీతాలు, విద్యుత్, ఇంటీరియర్స్, రవాణా వంటి ఖర్చులు లాభాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. డి-మార్ట్ అనేక ప్రదేశాలలో తన సొంత భవనాలను ఉపయోగిస్తుంది. సొంత భవనాలు కలిగి ఉండటం వల్ల అద్దె ఆదా అవుతుంది. కానీ నిర్వహణ, పన్ను ఖర్చులు మాత్రం ఉంటాయి. అయితే డి-మార్ట్ తన దుకాణాలను ఆర్భాటంగా అలంకరించదు. వస్తువులను అమర్చి, స్థలాన్ని తెలివిగా ఉపయోగించడం ద్వారా వారు చాలా డబ్బు ఆదా చేస్తారు.

ఇన్వెంటరీ టర్నోవర్

సరుకులు ఎక్కువ కాలం దుకాణంలో ఉండిపోతే, పెట్టిన పెట్టుబడి నిరుపయోగంగా మిగిలిపోతుంది. అంతేకాకుండా, నిల్వ ఖర్చులు పెరగడంతో పాటు, సరుకులు పాడైపోయే లేదా గడువు ముగిసిపోయే ప్రమాదం కూడా ఉంది. డి-మార్ట్ నిత్యావసర వస్తువులను వేగంగా అమ్మి, కొత్త ఉత్పత్తులను వెంటనే అందుబాటులోకి తెస్తుంది. దీనివల్ల వ్యాపారంలో డబ్బు వేగంగా చలామణి అవుతుంది. ఉదాహరణకు లక్ష రూపాయల విలువైన వస్తువులు త్వరగా అమ్ముడవుతాయి. అదే డబ్బుతో మళ్లీ కొత్త వస్తువులు కొనుగోలు చేస్తుంది. ఏ వస్తువులు త్వరగా అమ్ముడవుతున్నాయో, ఏవి అమ్ముడుపోకుండా మిగిలిపోతున్నాయో కంపెనీ నిశితంగా పర్యవేక్షిస్తుంది.

ప్రైవేట్ లేబుల్‌ల వాటా

డి-మార్ట్ తన సొంత బ్రాండ్ (ప్రైవేట్ లేబుల్స్) క్రింద అనేక వస్తువులను విక్రయిస్తుంది. ఈ బ్రాండ్లు ముఖ్యంగా కిరాణా సామాగ్రి, ధాన్యాలు, గృహోపకరణ వస్తువులలో కనిపిస్తాయి. ఇలాంటి ఉత్పత్తుల వల్ల మధ్యవర్తుల ఖర్చులు తగ్గుతాయి. అలాగే ధరపై కంపెనీకి నియంత్రణ ఉంటుంది. అయితే, ఇందులో ప్యాకేజింగ్, నాణ్యత నియంత్రణ, రవాణా, ఉత్పత్తి ఖర్చులు కూడా చేరి ఉంటాయి.

2025-26 ఆర్థిక సంవత్సరం: కంపెనీ వాస్తవ లాభం ఎంత?

డి-మార్ట్‌ను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ 2025-26 ఆర్థిక సంవత్సరపు వార్షిక నివేదిక ప్రకారం:

కంపెనీ మొత్తం రాబడి (కార్యకలాపాల ద్వారా వచ్చే రాబడి) సుమారు రూ. 66,968 కోట్లుగా ఉంది. పన్ను తర్వాత లాభం (పీఏటీ) సుమారు రూ. 3,224 కోట్లుగా ఉంది. లాభ మార్జిన్ (పీఏటీ మార్జిన్) -- సుమారు 4.8%. అంటే ప్రతి రూ. 100 రాబడికి, పన్నులు చెల్లించిన తర్వాత కంపెనీ సుమారు రూ. 4.80 లాభం సంపాదించింది. ఇది కంపెనీ మొత్తం అకౌంటింగ్ ఆధారంగా లెక్కించిన రేటు, అంతేగానీ ప్రతి అంశంపై రూ. 4.80 లాభం వస్తుందని దీని అర్థం కాదు.

వ్యాపారానికి కొత్త సవాళ్లు

కేవలం ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్మడం శాశ్వత విజయానికి హామీ ఇవ్వదు. మారుతున్న వినియోగదారుల కొనుగోలు అలవాట్లు, పోటీ కంపెనీల నుండి లభించే తగ్గింపులు, పెరుగుతున్న ఉద్యోగులు, రవాణా ఖర్చులు, ఇంకా కొత్త శాఖలను తెరవడానికి అవసరమైన పెట్టుబడి -- ఇవన్నీ లాభాలను ప్రభావితం చేస్తాయి.

ముఖ్యంగా 'క్విక్ కామర్స్' (అంటే 10 నిమిషాల్లో డెలివరీ చేసే కంపెనీలు) వేగంగా అభివృద్ధి చెందడం ఇటీవలి కాలంలో సాంప్రదాయ సూపర్ మార్కెట్లకు ఒక పెద్ద సవాలుగా మారింది. డి-మార్ట్ విజయం రాత్రికి రాత్రే సాధ్యపడలేదు. భారీ కొనుగోళ్లు, సరఫరాదారులతో మంచి ఆర్థిక సంబంధాలు, వస్తువుల వేగవంతమైన అమ్మకాలు, వ్యయ నియంత్రణ, సొంత ఉత్పత్తుల కారణంగా ఆ సంస్థ ఈ విజయాన్ని సాధించింది. ఒకే వస్తువుపై అధిక లాభాలను ఆశించకుండా, ప్రతి ఖర్చుపై నిశితంగా దృష్టి సారిస్తూ, నిరంతరం అనేక ఉత్పత్తులను విక్రయించడం ద్వారా ఒక సంస్థ ఎలా వృద్ధి చెందగలదో చెప్పడానికి డి-మార్ట్ ఒక మంచి ఉదాహరణ.

పతనమవుతున్న

రూపాయి విలువ..

ఆర్‌బీఐ కీలక నిర్ణయం

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు బారెల్‌కు 100 డాలర్లు దాటడంతో భారత చమురు రంగానికి ఊరట కలిగించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ మూడేళ్ల ప్రభుత్వ రంగానికి చెందిన చమురు మార్కెటింగ్ కంపెనీలు - ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లకు ప్రత్యేక డాలర్ విండో సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా సదరు చమురు కంపెనీలు తమ రోజువారీ డాలర్ అవసరాల మొత్తాన్ని ఆర్‌బీఐ ద్వారానే నేరుగా పొందే వీలు కలుగుతుంది.



అక్టోబర్ 12, 2026 నుంచి అమలులోకి రానున్న ఈ కొత్త వ్యవస్థ తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు కొనసాగుతుందని ఆర్‌బీఐ తెలిపింది. దీనికింద, నిర్ణీత బ్యాంకుల ద్వారా ఆర్‌బీఐ చమురు కంపెనీలకు డాలర్లను విక్రయిస్తుంది, తద్వారా ఆ కంపెనీల విదేశీ మారకద్రవ్య అవసరాలు సులభంగా తీరుతాయి. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దాదాపు 97 స్థాయికి చేరువైంది. శుక్రవారం నాటికి రూపాయి మారకం విలువ 96.73 వద్ద ముగిసింది. ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రూపాయిపై ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. కాగా, అక్టోబర్ 2తో ముగిసిన వారానికి దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు (ఫారెక్స్) 12.95 బిలియన్ డాలర్లు తగ్గి 734.60 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను తీవ్రంగా సమీక్షించిన తర్వాత ఈ సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు ఆర్‌బీఐ తెలిపింది. భారత్ తన ముడి చమురు అవసరాలలో 88 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ధరలు పెరిగినా లేదా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ క్షీణించినా దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రభావానికి గురవుతోంది. పెరిగిన అంతర్జాతీయ ఇంధన ధరలకు అనుగుణంగా దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను సవరించకపోవడంతో ఈ మూడేళ్ల ఆయిల్ కంపెనీలు భారీగా నష్టపోతున్నట్లు సమాచారం. ఇదివరకు రోజుకు ఏకంగా రూ. 500 కోట్లకు పైగా నష్టాలను ఈ కంపెనీలు చవిచూశాయని అంచనా. మరోవైపు ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా, ఉత్పాదక రంగాలు తీవ్రంగా దెబ్బతిని సామాన్యుల ఇంటి బడ్జెట్‌పై ప్రభావం పడుతుంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.2 శాతానికి చేరుకునే అవకాశం ఉందని, దీని వల్ల ద్రవ్యోల్బణ ముప్పు పొంచి ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్‌బీఐ ఇటీవల అక్టోబర్ 7న కీలక రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చింది. ఆర్‌బీఐ తెచ్చిన ఈ ప్రత్యేక డాలర్ విండో ద్వారా చమురు కంపెనీలకు తాత్కాలిక ఊరట లభించినప్పటికీ, విదేశీ చమురుపై ఆధారాన్ని తగ్గించుకోవడం, విదేశీ మారకద్రవ్య సంపాదన సామర్థ్యాన్ని పెంచుకోవడమే భారత్ ముందున్న అసలైన సవాలుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఎవరికి వారే.... యమునా తీరే!

వనపర్తి మున్సిపాలిటీలో కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కార్యాలయానికి వచ్చి గంటల తరబడి నిరీక్షిస్తున్న ప్రజలు.. పట్టించుకునే వారు లేరు

మున్సిపల్ అధికారుల పనితీరులో మార్పు ఎప్పుడొస్తుంది?



వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 10 (సింగిడి): ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాల్సిన వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు సమయానికి స్పందించకపోవడం, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు నిరీక్షించాల్సి రావడం వంటి పరిణామాలు పురపాలక పాలనపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కార్యాలయంలో ఏ పని ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

-అధికారులపై పర్యవేక్షణ ఏదీ?

మున్సిపాలిటీలో పరిపాలన సజావుగా సాగాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. ప్రజలకు అందుబాటులో ఉండటం, దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించడం, సమస్యలపై తక్షణమే స్పందించడం అధికారుల ప్రాథమిక బాధ్యత. అయితే ఈ బాధ్యతల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎంతవరకు ఉందనే ప్రశ్నలు వస్తున్నాయి. అధికారులు, సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-కార్యాలయానికి వస్తే నిరీక్షణేనా?

ఇంటి పన్నులు, పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, నిర్మాణ అనుమతులు, ఇతర పౌర సమస్యల పరిష్కారం కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తారు. రోజువారీ పనులను పక్కనపెట్టి కార్యాలయానికి వచ్చే ప్రజలకు సకాలంలో సేవలు అందకపోతే వారి సమయం వృథా కావడమే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం కూడా సన్నగిల్లే ప్రమాదం ఉంది. ప్రజల సమస్యలను వినేందుకు, పరిష్కార మార్గాలను చూపేందుకు అధికారులు అందుబాటులో ఉండాల్సిన తరుణంలో నిరీక్షణ తప్ప మరో మార్గం లేకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

-ప్రజలకు జవాబుదారీతనం ఎక్కడ?

పురపాలక సంఘం అనేది ప్రజలకు నేరుగా సేవలందించే కీలక ప్రభుత్వవ్యవస్థ. ఇక్కడి అధికారుల పనితీరు పట్టణ ప్రజల దైనందిన జీవితాలపై ప్రభావం చూపుతుంది. అలాంటి కార్యాలయంలో జవాబుదారీతనం, సమయపాలన, పారదర్శకత తప్పనిసరి. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ప్రజలకు సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాల్సిన సిబ్బంది వ్యవహారశైలిపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని ప్రజలు తమ అభిప్రాయం వ్యక్త చేస్తున్నారు

-ఉన్నతాధికారులు స్పందించేదెప్పుడు?

మున్సిపల్ కార్యాలయ పనితీరును ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఏ అధికారి ఏ సమయంలో అందుబాటులో ఉంటారు? దరఖాస్తుల పరిష్కారానికి ఎంత సమయం పడుతోంది? పెండింగ్‌లో ఉన్న ఫైళ్లెన్ని? వాటిని పరిష్కరించడంలో జాప్యానికి కారణాలేమిటి? అనే అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టాలి. అవసరమైతే బాధ్యతల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు

-వనపర్తి మున్సిపాలిటీలో అధికారుల పనితీరులో మార్పు వస్తుందా?

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్లక్ష్యానికి తావుండకూడదు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడమే పరిపాలనకు అసలైన కొలమానం. వనపర్తి మున్సిపాలిటీలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సేవల మెరుగుదలకు చర్యలు చేపడతారా? లేక ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉండాలా? అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించినప్పుడే పురపాలక సంఘం పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్ స్పందించి కార్యాలయ సిబ్బంది పనితీరుపై చర్యలు చేపట్టి ఎక్కడ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

పంటలకు సాగునీరు అడిగితే నాన్ బెయిలబుల్ కేసులు పెడతారా ?

14 మంది రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడంపై బిఆర్ఎస్ మాజీ మంత్రుల ఫైర్

రైతులను అరెస్టు చేస్తే చూస్తూ ఊరుకోం

రైతులతో పెట్టుకున్న రేవంత్ సర్కార్ కు రోజులు దగ్గరపడ్డాయి

మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి శ్రీనివాస్ గౌడ్



అమరచింత, అక్టోబర్ 10 (సింగిడి): జూరాల ఆయకట్టుకు రైతులు సాగునీరు అడిగిన పాపానికి 14 మంది రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయడంపై టిఆర్ఎస్ మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి లక్ష్మారెడ్డి శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని బి ఆర్ఎస్ మండల అధ్యక్షులు రవి కుమార్ యాదవ్ నివాసంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ రైతులు కడుపు మండి గేట్లు తెరిచారని ఇది గ్రహించని ప్రభుత్వం వారిపై కేసులు పెట్టడం పై తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. కేసులు నమోదైన రైతులను వారు పరామర్శించారు. ఉద్దేశపూర్వకంగా రైతులు వెళ్లి ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారా అని ప్రశ్నించారు. ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం, అలాగే రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రైతులకు నీరు ఇవ్వనందుకే రైతులు ఆగ్రహంతో గేట్లు తెరిచారని అన్నారు. పంటలు కాపాడుకునే ప్రయత్నంలోనే గేట్లు తెరిచారని ఇది గ్రహించని రేవంత్ సర్కార్ రైతులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రైతులను అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. రైతులపై సర్కారు పెట్టిన నాన్ బయిలబుల్ కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు. జూరాల ప్రాజెక్టు కట్టింది రైతులకు సాగునీరు ఇవ్వడానికి కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల పైన పెట్టిన కేసులు ఎత్తివేసి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, వీరేశలింగం, మాజీ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, మాజీ కటో ఆప్షన్స్ సభ్యులు రియాజ్ అలీ పాల్గొన్నారు.

సాయినాథుని 108వ పుణ్యతిథి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

- **11 నుంచి 22 వరకు శరన్నవరాత్రి వేడుకలు..**
- **ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు**



చింతపల్లి, అక్టోబర్ 10 (సింగిడి): అపర శిరిడిగా ప్రసిద్ధి చెందిన చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయినాథుని ఆలయం భక్తుల ఆధ్యాత్మిక సందడికి ముస్తాబైంది. అశేష భక్తజనుల ఆరాధ్య దైవమైన సాయినాథుని 108వ పుణ్యతిథి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సుందరంగా అలంకరించడంతో పాటు, ఈ నెల 11 నుంచి 22 వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

భక్తులను ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు

షిరిడీలో 12 సంవత్సరాల బాలుడిగా దర్శనమిచ్చిన సాయిబాబాను మహల్సపతి 'ఆవో సాయి' అని సంబోధించగా, అనంతరం సాయిబాబాగా భక్తులకు సంపూర్ణ దర్శనమిచ్చి, తన దివ్య లీలలతో శిరిడీ ప్రజల కష్టాలను తొలగించినట్లు భక్తుల విశ్వాసం. 1918 అక్టోబర్ 15న సాయిబాబా సమాధి పొందారు. ఈ విజయదశమితో స్వామివారి సమాధి పుణ్యతిథికి 108 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. మరోవైపు ముగ్గురమ్మల మూలపుటమ్మ అయిన శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కార్యక్రమాలను రూపొందించింది. ఈనెల 11న శానకొండ శివ కిరణ్ శర్మ నవరాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించనున్నారు. 12న జల్లా జయరాములు ఆధ్వర్యంలో గజేంద్రమోక్షం హరికథా కాలక్షేపం,13 న వావిలాల నాగమణి ఆధ్వర్యంలో శివలీలలు హరికథా కాలక్షేపం, 14, 19 తేదీలలో భజన సంకీర్తన కార్యక్రమాలనునిర్వహించనున్నారు. 15 న సినీనటి కరాటే కళ్యాణి శ్రీ వల్లీ కళ్యాణాన్ని హరికథా రూపంలో ప్రదర్శించనున్నారు. 16 న కుమారి వెంకటి నాగ సింధు ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం హరికథా కాలక్షేపం,17 న బంగారు లక్ష్మి ఆధ్వర్యంలో శ్రీ పార్వతీ కళ్యాణం హరికథా కాలక్షేపం,18 న జిల్లా జయరాములు ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణి కళ్యాణం హరికథా కాలక్షేపం నిర్వహించనున్నారు. 20 న విజయదశమి సందర్భంగా స్వామివారికి 108 కలశాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో పాలపిట్ట దర్శనం అనంతరం శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 21న పూర్ణాహుతి కార్యక్రమంతో పాటు సాయినాథుని ఏకనామ సంకీర్తన నిర్వహించనున్నారు. 22 న పద్మశ్రీ గరికపాటి నరసింహారావు స్వామివారి పుణ్యతిథి కార్యక్రమం సందర్భంగా ఉదయం 11 గంటలకు ప్రవచనం చేయనున్నారు.ప్రతిరోజు హరికథా కాలక్షేపాల కార్యక్రమాన్ని మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించనున్నారు.సాయినాథుని పుణ్యతిథి వేడుకలు, శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ తెలిపారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథుని ఆశీస్సులు పొందడంతో పాటు ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిళలు తమ హక్కులను తెలుసుకుని మనోధైర్యంతో ముందుకుసాగాలి

రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు





హనుమకొండ, అక్టోబర్ 10 (సింగిడి): నేటి సమాజంలో మహిళలు తమ హక్కులను తెలుసుకొని మనోధైర్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద సూచించారు. హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా కమిషన్ అధ్యక్షురాలిగా తాను అనేక సవాళ్లను అధిగమిస్తూ మహిళల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నానని నేరెళ్ల శారద తెలిపారు. బతుకమ్మ తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక మాత్రమే కాకుండా మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, సామాజిక సమైక్యతకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, దాడులు రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీలో రాత్రి తొమ్మిది గంటల సమయంలో జరిగిన సంఘటన మహిళల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందని అన్నారు. మహాత్మా గాంధీ పేర్కొన్నట్లు మహిళ అర్ధరాత్రి ఒంటరిగా స్వేచ్ఛగా తిరగగలిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధించినట్లు భావించగలమని గుర్తుచేస్తూ, నేటి పరిస్థితుల్లో రాత్రి తొమ్మిది గంటలకే మహిళలకు స్వేచ్ఛ, భద్రత కరువవడం విచారకరమని పేర్కొన్నారు. మహిళలకు సమాజంలోనే కాకుండా కుటుంబంలోనూ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, చివరకు కన్నతండ్రి దగ్గర కూడా ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతున్న ఘటనలు సమాజం ఎటువైపు వెళ్తోందో ఆలోచింపజేస్తున్నాయని అన్నారు.మహిళలకు విద్య, స్వేచ్ఛ, ఆత్మగౌరవం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మహిళల హక్కుల గురించి తెలుసుకోవాలని శారద పిలుపునిచ్చారు. మహిళల హక్కులపై విస్తృత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల నుంచే ప్రారంభిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో బాలికలకు స్వీయరక్షణ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని, ప్రతి శుక్రవారం, శనివారం ఈ కార్యక్రమాలను నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు పంపించనున్నట్లు తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. మహిళలందరూ ఒకచోట చేరి, బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతోపాటు మన సంప్రదాయాలను కాపాడేందుకు దోహదపడతాయని తెలిపారు.కూడా చైర్మన్ గుండు సుధారాణి మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఉత్తర తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన గొప్ప విద్యాసంస్థ అని అన్నారు. ఈ కళాశాలలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు వంటి ప్రముఖులు విద్యనభ్యసించడం గర్వకారణమని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని అన్నారు. కళాశాల శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతోపాటు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు ఆచార్య బి. రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ మహిళలు బతుకమ్మ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారని అన్నారు. ప్రకృతితో మమేకమై పూలతో బతుకమ్మను అలంకరించి, సమూహంగా ఆటపాటల్లో పాల్గొనడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు.డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం కళాశాలకు ఆర్థిక సహాయం అందించేలా సంబంధిత వర్గాలు కృషి చేయాలని కోరారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ విద్యాసంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించడం ద్వారా భవిష్యత్తు తరాలకు మెరుగైన విద్యావకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు.నాయిని నీలిమ, మహిళా కమిషన్ సభ్యులు రాధాబాయి, రమాదేవి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రాంతంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ అని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యంతో నిర్వహించే ఇటువంటి వేడుకలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని, తెలంగాణ సంస్కృతికి మరింత గుర్తింపును తీసుకొస్తాయని తెలిపారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుంకరి జ్యోతి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో అత్యంత ప్రధానమైనదని అన్నారు. ఈ పండుగను కళాశాలలో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు తెలంగాణ వారసత్వ సంపదపై అవగాహన కల్పించడంతోపాటు మన సంస్కృతిని భావితరాలకు అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యమివ్వాలని, వాటిని పరిరక్షించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపల్ ఎస్.ఎన్. రెహమాన్, అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బిక్షపతి, ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ ఆదిరెడ్డి, సహాయ రిజిస్ట్రార్ సునీల్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సుచరిత, డాక్టర్ సునీత, శ్రీలక్ష్మి, ఇతర అధ్యాపకులు, మహిళా కమిషన్ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. డీజే సంగీతం మధ్య కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- **పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్**



సిద్ధిపేట బ్యూరో,అక్టోబర్ 10 (సింగిడి): దాండియా కార్యక్రమాల నిర్వహణపై పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ రష్మి పెరుమాళ్ నిర్వాహకులతో శుక్రవారం రోజున సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతించిన సమయాన్ని మాత్రమే పాటిస్తూ, నియమావళికి లోబడి వేడుకలు నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజల రద్దీని తగిన విధంగా నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో ముగించాలనీ అన్నారు. సామాజిక విద్రోహ శక్తులను లేదా అల్లరి మూకలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదన్నారు.ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనీ తెలిపారు. ఈవెంట్ సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ (జనరేటర్) ఏర్పాట్లు చేసుకోవాలనీ సూచించారు. అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పక చేపట్టాలనీ చెప్పారు.ఈవెంట్ స్థలంలోకి వచ్చే మరియు వెళ్లే మార్గాల్లో రద్దీ ఏర్పడకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద మరియు పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాలంటీర్లు ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు.వాలంటీర్లు సులభంగా గుర్తింపు పొందేలా ప్రత్యేక యూనిఫాం లేదా ఐడెంటిటీ ట్యాగ్‌లు తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూ సహకరించాలనీ తెలిపారు.ఈవెంట్ ముగిసే వరకు నిర్వాహకులు అక్కడే అందుబాటులో ఉండాలన్నారు. పబ్లిక్‌కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు వీలుగా అత్యవసర ఫోన్ నంబర్లను నిర్వాహకులు దగ్గర ఉంచుకోవాలనీ చెప్పారు. కార్యక్రమాలు ప్రారంభమయ్యే ముందే నిర్వాహకులు వాలంటీర్లకు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు.సమాజ శ్రేయస్సు, ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖకు నిర్వాహకులు, ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు.

పిచ్చి మొక్కల మధ్య డబుల్ బెడ్‌రూమ్ కాలనీ!

- **-పాములు, తేళ్లు, దోమలతో బెంబేలెత్తుతున్న కాలనీవాసులు**
- **ఫిర్యాదులు చేసినా స్పందించని మున్సిపల్ అధికారులు..**
- **ప్రజారోగ్యంపై నిర్లక్ష్యమెందుకు?**





వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 10 (సింగిడి): వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీ (ఆదర్శనగర్) సమస్యలకు నిలయంగా మారింది. నివాస గృహాల పక్కనే పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగా పెరిగి దట్టమైన పొదలుగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పొదల్లో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. దీంతో పాటు దోమల బెడద కూడా పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

-ఇళ్ల పక్కనే పొదలు.. నిత్యం భయమే!

ప్రజలు నివసించే ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడటం, పిచ్చి మొక్కలను తొలగించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం మున్సిపాలిటీ బాధ్యత. అయితే చిట్యాల రోడ్డులోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇళ్ల చుట్టూ, ఖాళీ స్థలాల్లో మొక్కలు విపరీతంగా పెరిగి పొదలుగా మారాయి. దీంతో విషపురుగులు, పాములు తిరుగుతున్నాయని, దీనివల్ల ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇళ్ల పరిసరాల్లో తిరగాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

-చెప్పినా వినిపించుకోరా?

కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, పరిసరాలను శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పిన స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనంతో నిర్వహించే పట్టణ పారిశుద్ధ్య వ్యవస్థ ప్రజలకు ప్రయోజనం చేకూర్చనప్పుడు దాని నిర్వహణపై పర్యవేక్షణ ఎక్కడ ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

-ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉన్నా పట్టదా?

వర్షాలు, తేమతో కూడిన వాతావరణంలో పెరిగే పొదలు దోమలు, ఇతర కీటకాలకు అనుకూల పరిస్థితులను కల్పించే అవకాశం ఉంది. ఇప్పటికే దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులకు ఈ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. వనపర్తి పట్టణంలో ఇప్పటికే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు వ్యాప్తి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కూడా అటువంటి పరిస్థితి వస్తుందో ఏమోనని కాలనీవాసులు ఆందోళన పడుతున్నారు. సమస్యను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు, ఫిర్యాదులు అందిన తర్వాత కూడా ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

-ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా?

డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలను తక్షణమే తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య తీవ్రతను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాగారంలో సెల్‌ఫోన్ టవర్‌కు వ్యతిరేకంగా శాంతియు

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు!

ప్రభుత్వ ఉద్యోగుల సేవలను కించపరిస్తే సహించేది లేదు,

జిల్లా ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి





కలీంనగర్, (సింగిడి):
ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, సేవలు, ఆర్థిక భద్రతపై వాస్తవాలను పక్కనపెట్టి ప్రజల్లో అపోహలు కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని జిల్లా ఉద్యోగుల ఐక్యకార్యాచరణసమితి చైర్మన్, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లోక్‌సత్తా నాయకుడు జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ విద్య, వైద్యం, భద్రత, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి తదితర రంగాల్లో ప్రజలకు సేవలందించేది ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. అనేక ఒత్తిళ్ల మధ్య బాధ్యతలు నిర్వర్తించే ఉద్యోగుల సేవలను గుర్తించకుండా విమర్శించడం తగదన్నారు. ఉద్యోగుల పనితీరుపై నిర్మాణాత్మక విమర్శలు చేయవచ్చని, అయితే కొందరి తప్పులను మొత్తం ఉద్యోగ వ్యవస్థకు ఆపాదించడం సరికాదని స్పష్టం చేశారు.పదవీ విరమణ అనంతరం గౌరవ ప్రదమైన జీవితం గడిపేందుకు పెన్షన్ కీలకమని, దానినిభిక్షగా చూడటం ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమేనని అన్నారు. పెన్షన్ విధానంపై చర్చించేటప్పుడు ఉద్యోగుల జీవితకాల సేవలను, వృద్ధాప్య భద్రతను పరిగణనలోకి తీసుకో వాలని సూచించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయాలంటే ఆదాయాలు, ఖర్చులు, అప్పులు, సంక్షేమ పథకాలు సహా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. తెలంగాణలో ఉద్యోగులు కరువు భత్యం బకాయిలు, వేతన సవరణ, పెన్షన్ విధానం, ఆరోగ్య పథకాలు, పదవీ విరమణ ప్రయోజనాల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా వారిపై విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు.ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను గౌరవిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా నిర్మాణాత్మక చర్చ జరగాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు స్వస్తి పలికి, వాస్తవాల ఆధారంగా బాధ్యతాయుతంగా మాట్లాడాలని జయప్రకాశ్ నారాయణకు సూచించారు.

బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

శివాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు..

మహిళలకు ఇబ్బందులు కలగకుండా పోలీసు బందోబస్తు

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి:

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్





జమ్మికుంట,(సింగిడి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలకు జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం సర్వం సిద్ధం చేసింది. పట్టణ పరిధిలోని శివాలయం వద్ద బతుకమ్మ వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టింది. తొమ్మిది రోజులపాటు జరిగే ఉత్సవాలను మహిళలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పిలుపునిచ్చారు.బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. పండుగకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యే అవకాశం ఉండటంతో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేడుకలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసుసిబ్బంది పర్యవేక్షణ చేపట్టనున్నారు.పండుగవేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మహిళలు పోలీసులకు సహకరించాలని, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబురాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని నిర్వాహకులు సూచించారు.



మొదటి రోజు బాలీగా తరలివచ్చిన మహిళలు

తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను పట్టణంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో బాలీ ఎత్తున తరలివచ్చి ఆటపాటలతో సందడి చేశారు. వయసుతో సంబంధం లేకుండా పట్టణంలోని మహిళలు ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ వేడుకలను నిర్వహించుకోగా అధికారులు సకల ఏర్పాట్లు చేశారు.

గంగుల నివాసంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు



కలీంనగర్, (సింగిడి) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు మాజీ మంత్రి, కలీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. కుటుంబ సభ్యులంతా కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పింది. ఈ వేడుకల్లో గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజితతో పాటు కుటుంబసభ్యులు శారద, గీత, సునీత తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్



జమ్మికుంట, (సింగిడి) ఉమ్మడి కలీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ శనివారం పలు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కుల వివక్ష పోరాట కమిటీ నాయకులు విద్యార్థి నేత వడ్లూరి కిషోర్ పుట్టినరోజు సందర్భంగా రమేష్ ఆయనను శాలువాతో సన్మానించి సత్కరించారు. అనంతరం మైనార్టీ యువకుడు అప్రోచ్ పుట్టినరోజు సందర్భంగా శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, కిషోర్ విద్యార్థి దశ నుండి ఉద్యమ నాయకుడిగా విద్యార్థుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశాడని భవిష్యత్తులో కూడా మరిన్ని ఉన్నత పదవులు పొంది సమాజ సేవలో ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షించారు. అప్రోచ్ కిషోర్ ఇద్దరి పుట్టినరోజు సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయడం జరిగిందని వారు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ మాచర్ల రాజు రైతు సంఘం నాయకులు చెరుకూరి రాము నాయకులు జవ్వాజి బిరంజీవి టిఆర్ఎస్వి నాయకులు ఆలేటి శ్రీరామ్ రాపర్తి అఖిల్ గౌడ్ ఓల్లాల శ్రీకాంత్ గౌడ్ నాయకులు పుల్యాల వినోద్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



హనుమకొండ (సింగిడి): హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో శుక్రవారం నాడు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబరాలకు ముఖ్యఅతిథిగా హనుమకొండ పోలీస్ కమిషనర్ శ్వేతా ముఖ్య అతిథిగా పాల్గొని బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణలో అతిపెద్ద పెద్దపండుగవివిధ రకాల పూలతో మహిళలు అందంగా బతుకమ్మను పేర్చి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయం, అందరికీ తెలిసే విధంగా బతుకమ్మ పాటలతో మహిళలంతా గుంపులు గుంపులుగా బతుకమ్మ బతుకమ్మ ఆడుతారని, అనంతరం హనుమ కొండ పోలీస్ కమిషనర్ విద్యార్థులతో బతుకమ్మ ఆడారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ తెలంగాణలో మహిళలు ఆడేఅతిపెద్ద పండుగ బతుకమ్మఅని చిన్నపిల్లల నుండి పెద్దవారు సైతం తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆడుతారని, మొదటి రోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభంతో సద్దుల బతుకమ్మతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ రామచంద్రం, కాకతీయ యూనివర్సిటీ అధికారులు అనిత రెడ్డి, సుకుమారి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ రహమాన్, అసిస్టెంట్ రిజిస్టర్ సునీల్ కుమార్, కళాశాల సూపరిండెంట్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.



రాబోయే రోజుల్లో సిద్దిపేట మీదుగా ఉత్తర భారతానికి రైలు

దేశంలో సిద్దిపేట కు గౌరవం దక్కింది..

సందులు, పందులు, చెత్తకుండీలు లేకుండా మార్చుకున్నాం...

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట జిల్లా, (సింగిడి)

రాబోయే రోజుల్లో సిద్దిపేట మీదుగా ఉత్తర భారతానికి రైళ్లు నడవనున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. జిల్లా పదేళ్ల పండుగ సందర్భంగా వర్తక, వాణిజ్య వ్యాపార, వైశ్య సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిద్దిపేటకు రైలు ఎవరు తేలేదని భారస సర్కార్ రైల్వే శాఖ పెట్టిన నిబంధనలను ఒప్పుకోవడం తోనే సిద్దిపేటకు రైలు పచ్చిందన్నారు. హైదరాబాద్ నుండి సిరిసిల్ల వరకు రైల్వే ట్రాక్ కోసం భూములను రాష్ట్ర ప్రభుత్వమే 800 కోట్లతో కొనుగోలు చేసిందన్నారు. అలాగే మొత్తం ఖర్చులు మూడో వంతు ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే కట్టాలని, రైలు ప్రారంభం తర్వాత మొదటి ఐదు సంవత్సరాలు రైల్వే శాఖకు ఎలాంటి నష్టం జరిగిన అది రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఇలా చాలా నియమ నిబంధనలను ఒప్పుకోవడంతోనే సిద్దిపేటలో రైలు కూత వినబడిందన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ నుండి సిద్దిపేట మీదుగా దక్షిణ భారతానికి ప్రతి అర్ధగంటకు ఒక రైలు నడవనుందన్నారు. దీనికి సంబంధించిన విద్యుత్ లైన్ పనులకు సంబంధించిన టెండర్లు పూర్తి అయ్యాయని పనులు కూడా త్వరగా పూర్తి అవుతాయన్నారు. సిద్దిపేటలో రైలు, గోదావరి జలాలు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు ఉండడంతోనే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.ప్రస్తుతం సిద్దిపేటకు మల్లన్నసాగర్ ద్వారా మంచినీళ్లు వస్తున్నాయన్నారు. కరెంటు లేకుండా మల్లన్న సాగర్ వద్ద వాలు తింపితే సిద్దిపేటలోని ప్రతి ఇంటికి నీళ్లు వచ్చి చేరుతాయన్నారు. వచ్చే పందేళ్ల వరకు సిద్దిపేటలో మంచినీళ్ల గోస ఉండొద్దన్న ముందుచూపుతో కావలసిన సదుపాయాన్ని ఏర్పాటు చేశానన్నారు. తాను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైస్, పత్తి మిల్లుల వ్యాపారవేత్తలకు ఇబ్బందులు కలవకుండా అన్ని విధాలుగా అండగా నిలిచానన్నారు. భారస పదేండ్ల కాలంలో రైస్ మిల్లులపై అధికారుల దాడులు కనబడకుండా పోయాయన్నారు. సిద్దిపేటలో సంది, పంది, చెత్తకుండీ లేకుండా తయారు చేసుకున్నామన్నారు.కెసిఆర్ ఆశీస్సులు ప్రజలదీవెనలతో తాను ఈ స్థాయిలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. చరిత్ర కాలం ఉన్నంతవరకు తాను సిద్దిపేటలో చేసిన అభివృద్ధి పనులు నిలబడి ఉంటాయన్నారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా సిద్దిపేట వాళ్లమంటే గౌరవం దక్కేలా అభివృద్ధి చేశానన్నారు....

పుట్టినరోజు వేడుకల్లో మానవత్వపు పరిమళం!

నిరుపేదలకు, ఆసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ జియా బాయ్

గోదావరిఖని: (సింగిడి) పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టి నిరుపేదలకు అండగా నిలిచారు గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ జియా బాయ్. తన జన్మదినాన్ని పురస్కరించుకుని పేద కుటుంబాలకు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

వేడుకలకు కొత్త అర్థం.. సేవే అసలైన సంతోషం!

పుట్టినరోజు అంటే కేవలం సంబరాలు, ఆర్భాటాలకే పరిమితం కాకుండా.. ఆ రోజున అవసరంలో ఉన్నవారికి సహాయం అందించాలనే సంకల్పంతో సయ్యద్ జియా బాయ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసరంగా ఉపయోగపడే ఆహార పదార్థాలను అందించడంతో పాటు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

పేదలకు అండగా నిలవడమే లక్ష్యం

ఈ సందర్భంగా సయ్యద్ జియా బాయ్ మాట్లాడుతూ, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నవారికి చేతనైన సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అవసరంలో ఉన్నవారికి నేరుగా సహాయం అందించడం ద్వారా కలిగే సంతృప్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో పేదలకు సహాయం చేస్తూ సామాజిక బాధ్యతను చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారానే నిజమైన ఆనందం లభిస్తుందని, సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆకాంక్షించారు.



అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక,

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి



కలీంనగర్, (సింగిడి) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ పాఠశాల ప్రాంగణంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు ఆయన సతీమణి డా. వి. వనజా నరేందర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు విశేష ప్రాధాన్యత ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ గొప్ప సంప్రదాయాన్ని పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రతి ఏటా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వేడుకల్లో విద్యార్థినులు అందంగా అలంకరించిన బతుకమ్మలతో సందడి చేయగా, జానపద గేయాలకు అనుగుణంగా ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లాల్లో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు..



సిద్దిపేట జిల్లా, (సింగిడి) జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా బతుకమ్మ ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామంలో బతుకమ్మ పండుగ సందడి నెలకొనడంతో పల్లె వాతావరణం పూల పరిమళంతో, సంప్రదాయ ఆటపాటలతో కళకళలాడింది.

రాజీవ్ నగర్‌లో బతుకమ్మ సంబరాల సందడి..!

పూల పండుగలో మహిళలతో మమేకమైన కందుల సంధ్యారాణి
సంప్రదాయబద్ధంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు..
ఆటపాటలతో కళకళలాడిన రాజీవ్ నగర్



గోదావరిఖని, (సింగిడి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు రాజీవ్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్‌లోని వల్ల సుజాత నివాసంలో జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు మహిళల సందడి, సంప్రదాయ ఆటపాటలతో ఉత్సాహభరితంగా సాగాయి.

ఈ వేడుకలకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలనీ మహిళలతో కలిసి వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, అనంతరం వారితో కలిసి బతుకమ్మ ఆటల్లో పాల్గొన్నారు. మహిళలతో ఆత్మీయంగా మమేకమై పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

మహిళల ఐక్యతకు బతుకమ్మ ప్రతీక

ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు నిర్వహించడం మన సంస్కృతిపై ఉన్న అభిమానానికి నిదర్శనమని తెలిపారు.

మహిళల కోలాహలంతో కళకళలాడిన వేడుకలు



సంప్రదాయబద్ధంగా పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో మహిళలు వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయ, తిరుమల, కనకలక్ష్మి, లచ్చమ్మ, కళావతి, మహేశ్వరి, శ్యామల, పద్మ, సాయిప్రియ, సరిత, కవిత, పావని, శ్వేత, భాగ్య, సంజన, రమ్య, శారద, శాన్వి, యశస్విని, శాన్విక తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ నగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

కరీంనగర్, (సింగిడి)తెలంగాణ సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను గాయత్రీ నగర్‌లో ఘనంగా నిర్వ హించారు. మహిళలు రంగురంగుల పూలతో బతు కమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లతో బతుకమ్మల చుట్టూ కోలాహలంగా ఆడిపాడారు. కాలనీ కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు గూట్ల శంకర్, మోసర్ల రాంరెడ్డి, పూసాల



సంపత్, భీమానాతుని శ్రీనివాస్, డాక్టర్ శివ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి ఆలయంలో వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ

మహిళల గౌరవం, కుటుంబ బంధాల పరిరక్షణే బతుకమ్మ సందేశం
పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దంపతులు



కరీంనగర్, (సింగిడి)

తెలంగాణ సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో ఘనంగా ప్రారం భమయ్యాయి. తొమ్మిది రోజుల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మహిళలు సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేర్చి, జానపద గీతాలు పాడుతూ ఆట పాటలతో సందడి చేశారు. భవానీ దీక్షలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వేడుకల్లో పాల్గొని తిలకించారు. ఆయన సతీమణి అపర్ణతోపాటు కుటుంబ సభ్యులు కూడా ఉత్సవాల్లో భాగ స్వాములయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ప్రేమించడం, చెరువులను కాపాడుకోవడం, మహిళలను గౌర వించడం, కుటుంబ బంధాలను బలో పేతం చేసు కోవడం, సంప్రదాయాలను భావితరాలకు అందిం చడం బతుకమ్మ పండుగ ప్రధాన సందేశమని తెలి పారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహాశక్తి ఆలయంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం వేళల్లో దాండియా నృత్యాలు, భక్తిగీతాల కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అమ్మవారినిదర్శిం చుకుని ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ గుర్తించి యజమానికి అప్పగింత

సీఈఐఆర్ సాంకేతికతతో ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న కరీంనగర్ గ్రామీణ పోలీసులు



కరీంనగర్, (సింగిడి) కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన కవ్వంపల్లి వెంకటయ్యపోగొట్టుకున్న ఒప్పో సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ సాంకేతికత సాయంతో గుర్తించి జగిత్యాలలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఫోన్‌ను యజమానికి అంద జేశారు. ఫోన్ గుర్తింపులో కృషి చేసిన కానిస్టేబుళ్లు బిట్ల రాంసాయి, భుక్య రమేష్‌లను ఆయన అభినందించారు.

భగత్ నగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అపర్ణ దంపతుల హాజరు

కరీంనగర్, అక్టోబర్10(సింగిడి) నగరంలోని భగత్‌నగర్ సంక్షేమ సంఘం, చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉపమేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు తన సతీమణి అపర్ణతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని పేర్కొన్నారు. కాలనీవాసులు ఐక్యంగా ఉత్సాహంగా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు, చిన్నారులు ఆటపాటలతో సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. నగర ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం, యువజన సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



దళిత బంధు నిధుల విడుదలకు కృషి చేయాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసిన వొడితల ప్రణవ్

జమ్మికుంట, (సింగిడి) రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ నియో జక వర్గంలో దళిత బంధు పథకానికి సంబంధించిన నిధుల విడుదలతో పాటు, దళితుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజక వర్గంలోని దళిత కుటుంబాలకు పథకం ద్వారా మరింత ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసు కోవాలని కోరారు. ప్రణవ్ విజ్ఞప్తిపై మంత్రి



అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాను కూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

బాలగోపాల్ సంస్మరణ సభను విజయవంతం చేయండి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ తిరుపతయ్య..

జమ్మికుంట, (సింగిడి): మానవ హక్కుల వేదిక, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హుజూరాబాద్‌లో నిర్వహించ నున్న హక్కుల నేత బాలగోపాల్ 17వ సంస్మరణ సభను విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్ తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పలు ప్రజా సంఘాల నాయకులు సంయుక్త పత్రికా ప్రకటన విడుదల చేశారు. హుజూరాబాద్‌లోని వివేల్‌ఆర్ ఫంక్షన్ హాల్(హుజూరాబాద్ క్లబ్)లో ఉదయం10 గంటలనుంచి మధ్యాహ్నం2గంటలవం-కు ఈ సభ జరగనుంది. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయవాది, సామాజిక, మానవ హక్కుల కార్యకర్త బేలా భాటియా ముఖ్య వక్తగా హాజరుకానున్నారు. 'నేటి సంద ర్భంలో బాలగోపాల్ హక్కుల దృక్పథం' అనే అంశంపై మానవ హక్కుల వేదిక, దళిత, ప్రజా సంఘాల నాయకులు తమ సందేశాలను అందించనున్నారు. ప్రజా స్వామిక విలువలు, మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసే వారందరూ ఈ సంస్మరణ సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. మానవహక్కులవేదికరాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్. తిరుపతయ్య, సీనియర్ జర్నలిస్ట్ ఆవునూరి సమ్మయ్య,



న్యాయవాది, టీజేఎస్ రాష్ట్ర నాయకులు ముక్కెర రాజు, భారత్ బచావో నాయకులు భీమోజు సదానందం, పాడి శెట్టి వెంకట్రాజం, రచయిత ఇమ్మడి సంపత్ కుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, డీటీఎఫ్ నాయకులు పి. ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు గుంటి సామ్రాజ్యం, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి అధ్యక్షుడు రామంచ భరత్, తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య నాయకుడు బాజ్జీ, ఆర్టీసీ నాయకులు శివదయాల్ సింగ్, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్ ఉన్నారు.

సంప్రదాయాల సిరులతో బతుకమ్మ సంబురం

బతుకమ్మను ఎత్తుకొని వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, (సింగిడి)నగరంలోని 45వ డివిజన్‌లో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. బతుకమ్మను ఎత్తుకొని వేడుకల్లో సందడి చేసిన ఆయన నగర ప్రజలకు పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు, ప్రకృతి ఆరాధనకు, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించి ఆనందాన్ని పంచుతాయని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో కరీంనగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే గొప్ప సంస్కృతి మనది..

మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ సర్కారే
సిద్దిపేటలో ఆగిపోయిన పనులను జెడ్ స్పీడ్ తో పూర్తి చేస్తాం
మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట జిల్లా (సింగిడి)పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే గొప్ప సంస్కృతి మన తెలంగాణ వారిదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. జిల్లా పదేళ్ల పండుగసందర్భంగా శనివారంకోమటి చెరువుమినీట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్లలో నిర్వహించిన లేజర్ షో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ సర్కారేనన్నారు. సిద్దిపేటలో ఆగిపోయిన పనులను జెడి స్పీడ్ తో పూర్తి చేస్తానన్నారు. ఒకప్పుడు బతకమ్మ పండుగ వచ్చిందంటే బతుకమ్మలను వేయడానికి నీళ్లు ఉండేవి కావని ప్రస్తుతం కాలేశ్వరం జలాలతో చెరువులు



నిండుకుండల్లా నిండి ఉన్నాయన్నారు. కెసిఆర్ ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయడంతోనే జిల్లాలోని ప్రతి ఒక్కరికి ఏదో విధంగా లబ్ధి చేరిందన్నారు. అమెరికా, లండన్ లాంటి దేశాలలో తనకు మిత్రులు ఉన్నారని ఈ పండుగకు అక్కడకి రావాలనివారు కోరగా తాను రాలేనని, తాను ఈ పండుగలను సిద్దిపేట నియోజకవర్గ ప్రజల మధ్యనే జరుపుకుంటూనే ఎంతో ఆనందం కలుగుతుందని చెప్పానన్నారు. సిద్దిపేట ప్రజలు తన కుటుంబ సభ్యులని తను ప్రజలకు ఎంత సేవ చేసినా తక్కువేనన్నారు. సిద్దిపేట బాగుంటేనే అందరం సంతోషంగా ఉంటామన్నారు. సిద్దిపేటలో సముద్రం లేని లోటు తీర్చడానికి కుమటి చెరువు వద్ద ఆర్టిఫిషియల్ బీచ్ ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అంతకుముందు హరీష్ రావు కొట్టు కోమటి చెరువు చుట్టూ తిరుగుతూ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజలు కూడా ఆయనతో సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపారు...

రంగారెడ్డి గూడలో 70వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
రంగారెడ్డి గూడలో 70వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్
ముఖ్య అతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి, పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ (**సింగిడి**) జడ్చర్ల నియోజవర్గం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడలో 70వ ఎస్‌జీఎఫ్ (SGF) రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కమ్ ట్రయల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్వగ్రామమైన రంగారెడ్డిగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులను అతిథులు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని వివరించారు. ఈ టోర్నమెంట్ క్రీడాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, ప్రతిభావంతులైన యువ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలిచింది.







సంప్రదాయాల సిరులతో బతుకమ్మ సంబురం

బతుకమ్మను ఎత్తుకొని వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, (సింగిడి)నగరంలోని 45వ డివిజన్‌లో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. బతుకమ్మను ఎత్తుకొని వేడుకల్లో సందడి చేసిన ఆయన నగర ప్రజలకు పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు, ప్రకృతి ఆరాధనకు, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించి ఆనందాన్ని పంచుతాయని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో కరీంనగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు!

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపం బతుకమ్మ
పూల పండుగతో పులకించిన శ్రీ గ్లోబల్ హైస్కూల్ ప్రాంగణం

బుగ్గారం, (సింగిడి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల వైవిధ్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.



సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ పండుగ దోహదం

బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడిన విశిష్టమైన పండుగ. ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆడిపాడటం ఈ పండుగ ప్రత్యేకత. తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యత, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ వేడుకలు అద్దం పడతాయి. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడంలో పాఠశాలల్లో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి.

విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యం

విద్యతో పాటు విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ద్వారా విద్యార్థులు తెలంగాణ పండుగల విశిష్టతను తెలుసుకునే అవకాశం కలుగుతుంది. పూలతో బతుకమ్మలను పేర్చడం, సంప్రదాయ పాటలు నేర్చుకోవడం, సమష్టిగా వేడుకల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, సృజనాత్మకత, సాంస్కృతిక విలువలు పెంపొందుతాయి. బతుకమ్మ పండుగకేవలం పూలను పేర్చి ఆడుకునే వేడుక మాత్రమే కాదని, అది తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మన మూలాలను మరచిపోకుండా, మన సంస్కృతిని గౌరవిస్తూ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే సందేశాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి. తెలంగాణ పల్లె సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మపల్లె సంస్కృతి, ప్రకృతి సౌందర్యం, ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతోంది. పాఠశాల స్థాయిలో ఇలాంటి వేడుకలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో తమ ప్రాంత సంస్కృతిపై గౌరవం పెరగడమే కాకుండా, సంప్రదాయాలను కాపాడుకోవాలనే భావన బలపడుతుంది. శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి. పూల పండుగ సందడి పాఠశాల ప్రాంగణంలో ఆనందోత్సాహాలను నింపింది.

పలు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



కమలాపూర్,(సింగిడి):మండలంలోని పలు పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.శనివారం నుండి పాఠశాలలకు సెలవులు కావడంతో,ముందస్తుగా శుక్రవారం మహాత్మజ్యోతిబాపూలే గురుకుల బాలికల, బాలుర పాఠశాలలో, ప్రభుత్వ, ప్రైవేట్ ,పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల మహిళ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లులు,విద్యార్థినీలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం బతుకమ్మ ఆడారు. తెలంగాణలో ఎంగిలిపూలతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులు ఈ వేడుకలు ఘనంగా సాగుతాయి. ఈ కార్యక్రమంలో ఏటిపి శ్రీవాణి, టీడబ్ల్యూత్రివేణి, ఏఎన్ఓ విజయ్, హెచ్ ఎస్ దీప, మంగా, సరితా బాయ్, రేణుక, హేమలత, పలు పాఠశాలల ఉపాధ్యాయినిలు,విద్యార్థినీలు, విద్యార్థుల తల్లులు, పాల్గొన్నారు.

సమాచార శాఖ అధికారులకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నేతల సన్మానం



హన్మకొండ, (సింగిడి):సమాచార ప్రసార శాఖ అడిషనల్ డైరెక్టర్ డీఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ లను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఐ అండ్ పీఆర్ అడిషనల్ డైరెక్టర్ గా భాధ్యతలు చేపట్టి మొదటి సారిగా వరంగల్ విచ్చేసిన డీఎస్ జగన్ ను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ కన్నేకంటి వెంకటరమణ, పూర్వ డీపీఆర్వో మనోహరాచారి, వరంగల్ జిల్లా డీపీఆర్వో ప్రేమలత, ఖమ్మం డీపీఆర్వో గౌస్ పాషా, రిటైర్డ్ ఉద్యోగి విధుమౌళి లను ప్రెస్ క్లబ్ వచ్చిన సందర్భంగా శాలువా కప్పి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. వారు ఉమ్మడి వరంగల్ జిల్లాలోచేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ సుధాకర్, ఈసీ మెంబర్లు నయీంపాషా, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షిరాం వర్ధంతి వేడుకలు.



ధర్మారం (సింగిడి):బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు బహుజన నాయకత్వ దర్శనీకుడు మాన్యవార్ కాన్సిరాం 20 వర్ధంతి వేడుకలను చుంచు మల్లేశం ఆధ్వర్యంలో ఈరోజు పత్తిపాక ఎక్స్ రోడ్ లోగల అంబేద్కర్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు కాన్సిరాం చిత్రప టానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం నాయకులు మాట్లాడుతూ కాన్షిరాం బడుగు బలహీన వర్గాల రాజకీయ హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు ప్రతి బహుజనుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి నరేష్ వాడకాపురం రవి దీకొండ రమేష్ నేరెళ్ల లక్ష్మీరాజశీ నేరెళ్ల దుర్గయ్య మల్లయ్యన్నాచరి కనకయ్యకుమ్మరి రాములు గడ్డం భూమయ్య సత్తయ్య పులి రామయ్య తదితరులు పాల్గొన్నారు

పిడిఎస్ సన్న బియ్యం అక్రమ రవాణా

ధర్మారం (సింగిడి):నంది మేడారంలో నెల లక్ష్మి నరసింహ రైస్ మిల్ లో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న సన్నబియాన్ని అక్రమంగా తరలించి రైస్ మిల్లులో దించుతున్నారని పక్కా సమాచారం మేరకు ఎస్సై ఏం బడి శ్రీకాంత్, సివిల్ సప్లై అధికారులతో కలిసి తనిఖీ చేయగా మోటం సారయ్య మోటం గురువయ్య కలిసి బొలెరో వాహనంలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడ్డ సన్నబియ్యం రైస్ మిల్లులో 19 క్వింటాళ్ల 60 కిలోల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించి పంచనామా నిర్వహించి రిక్విజేషన్ జారీ చేశారు. బియ్యాన్ని సరఫరా చేస్తున్న ఇరువురి పైన అలాగే మిల్లు యజమాని పైన చట్టపరమైన చర్యలకు సిఫారసు చేస్తామని, పేద ప్రజల కు అందించేందుకు సరఫరా చేస్తున్నా ఇట్టి బియ్యాన్ని అక్రమంగా తరలించడం నివ్వ చేయడం ఇతర అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని ఇలాంటి అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చట్టరీత్యా తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతిబింబం బతుకమ్మ

విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిపాడిన సర్పంచ్ పర్స రమేష్

బుగ్గారం, (సింగిడి):తెలంగాణ సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం శేకెళ్ళ గ్రామంలోని ప్రభు త్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పర్స రమేష్ పాఠశాల విద్యార్థినులతో కలిసి బతుక మ్మ ఆడిపాడుతూ పండుగ సందడిని పంచుకు న్నారు. తెలం గాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా చాటిచె ప్పారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,సంప్ర దాయ పాటలు పాడుతూ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా,ఆటపాటలతో సందడి నెలకొంది. తెలంగాణ





సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ పాఠశాలలో ప్రీ-బతుకమ్మ సంబరాలు



నల్లబెల్లి,(సింగిడి):నల్లబెల్లి మండలం రుద్రగూడెంలోని కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ హైస్కూల్‌లో ప్రీ-బతుక మ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియ జేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.విద్యా ర్థినులు రంగురంగుల పూలతో ఆకర్షణీ యమైన బతుకమ్మలను పేర్చి సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, వాటి చుట్టూ సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పూల పండుగ ప్రాముఖ్యతతోపాటు ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను,ఉపాధ్యా యులు విద్యార్థులకు వివరించారు.పాఠశాల కరస్పాండెంట్ ఎం. కమలాకర్‌రావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల,ఆ త్మీయతకు, ప్రకృతికి మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు విద్యతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకొని వాటిని భవిష్యత్ తరాలకు అందించాలని, సూచించారు.పాఠశాల డైరెక్టర్లు పి. రామారావు, జి. రాజిరెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి గర్వకారణమన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యత, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. రణధీర్‌రెడ్డి, బి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తెలంగాణ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపింది.

ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు
- విద్యార్థినుల ఆటపాటలతో పాఠశాలలో పండుగ సందడి
- కరెస్పాండెంట్ వీరమైన సంపత్ రావు ఆధ్వర్యంలో



ములుగు, (సింగిడి):జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం తాడిచర్ల గ్రామంలోని శ్రీ సాయి వాణి విద్యానికేతన్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్క రించుకుని పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కామ బాపు, తిర్రి అశోక్, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వీరమనేని సంపత్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేస్తూ వేడుక లను ఉత్సాహంగా నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి పట్ల గౌరవం, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు.



మూడు గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక

నల్లబెల్లి, (సింగిడి)::నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నల్లబెల్లి మండలంలోని మేడేపల్లి, రాంపూర్, ఆసరవెల్లి గ్రామాల్లో నూతన యూత్ కాంగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం సురేష్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహించారు.మేడేపల్లి, రాంపూర్ గ్రామాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తడక రాజు ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా బొడిగె శివ, కాసు పవన్, ప్రధాన కార్యదర్శిగా రాతి పెల్లి సందీప్, కార్యదర్శిగా జెల్ల రాకేష్, ఉపాధ్యక్షులుగా మార్గం శ్రీకాంత్, జెట్టి సతీష్‌లను ఎన్నుకున్నారు.ఆసరవెల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పత్యం రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాళ్లపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఆకారపు యశ్వంత్, ఉపాధ్యక్షుడిగా తోట నాగరాజు, కార్యదర్శిగా గౌరబోయిన సందీప్‌లను ఎంపిక చేశారు. ఇతర కార్యవర్గ సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పనే లక్ష్యంగా ముందుకు,సాగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ నాయకులు చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం,చేయడంతోపాటు



ప్రజా సమస్యల పరిష్కారానికి యువత ముందుండాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజలకు అండుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, పార్టీ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేరళ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సందడి



ములుగూర్, (సింగిడి):కొత్త దాంరాజ్ పల్లి గ్రామంలోని కేరళ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొంటూ విద్యార్థులు ఆనందోత్సాహాలను పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి, మహిళల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, ఐకమత్యం, సామూహిక భావన పెంపొందుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

చైతన్య పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



సంప్రదాయబద్ధంగా వేడుకలు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

భిక్కనూర్,(సింగిడి)::భిక్కనూర్‌లోని చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను



అందంగా అలంకరించి పండుగ విశిష్టతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భూర్ల రేణు కుమార్, హెడ్‌మాస్టర్ అశోక్ యాదవ్ లు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బతుకమ్మ పాటలు,



రంగురంగుల పూల అలంకరణలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆటపాటలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

స్వరపేటిక, వాయిస్, శ్వాసనాళ సమస్యలకు ప్రత్యేక చికిత్సలు

ఈఎన్‌టీ, శ్వాసనాళ శస్త్రచికిత్స, అలర్జీ, చెవి వ్యాధుల నిపుణుడు డా. అశీష్ డోరా ఘన్పూర్,

కరీంనగర్,(సింగిడి):సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో స్వరపేటిక, వాయిస్, శ్వాసనాళ సమస్యలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఈఎన్‌టీ నిపుణుడు డా. అశీష్ డోరా ఘన్పూర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని యశోద ఆసుపత్రి శాఖలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెవి, ముక్కు గొంతు సమస్యలతో పాటు పిల్లల్లో శ్వాసనాళ సమస్యలు, మింగడంలో ఇబ్బందులు, శ్వాసనాళాల సంకుచితం, గురక, నిద్రలో శ్వాస సంబంధిత సమస్యలకు ప్రత్యేక పరీక్షలు, వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. ఆధునిక నిర్ధారణ పరికరాలు, వివిధ విభాగాల నిపుణుల సమన్వయంతో సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ బృందంలో స్వరపేటిక, పిల్లల ఈఎన్‌టీ, శ్వాసనాళ శస్త్రచికిత్స, అలర్జీ, చెవి వ్యాధుల నిపుణుడు డా. అశీష్ డోరా ఘన్పూర్, తల--మెడ క్యాన్సర్ శస్త్రచికిత్స, ముక్కు సైనస్, కపాల అడుగు భాగం శస్త్రచికిత్స నిపుణురాలు డా. ఎన్. అపూర్వా రెడ్డి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.సాధారణ ఈఎన్‌టీ సమస్యల నుంచి సంక్లిష్టమైన వాయిస్, శ్వాసనాళ సమస్యల వరకు సమగ్ర చికిత్స అందించడమే మా లక్ష్యం. వివిధ



విభాగాల నిపుణుల సమన్వయంతో రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాం" అని డా. అశీష్ డోరా ఘన్పూర్ తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్లు సుధీర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే కాన్షీరాంకు నిజమైన నివాళి

'ఓట్లు మావి.. సీట్లు మీవా?' నినాదంతో బహుజనుల్లో చైతన్యం నింపిన మహానేత

భీమదేవరపల్లి,(సింగిడి):బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యంగా మాన్యవర్ కాన్షీరాం చూపిన మార్గంలో ముందుకు సాగాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తకొండలో భీమదేవరపల్లి అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 'ఓట్లు మావి.. సీట్లు మీవా?' అనే నినాదంతో బహుజనులను ఏకతాటిపైకి తీసుకొచ్చిన గొప్ప నాయకుడు కాన్షీరాం అని కొనియాడారు. బహుజనులు, మేధావులు ఐక్యంగా ఉంటూ సామాజిక న్యాయం, రాజకీయ అధికార సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పాల ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తందూరి ఎల్లయ్య, ఉప్పుల కుమారస్వామి, సర్పంచ్ బాలరాజు, ములుగురి సునీత, మాజీ ఎంపీటీసీ మేక రమేష్, వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



singidinews@gmail.com

మాస్ తుఫాన్ మొదలైంది..

ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్‌పై అప్డేట్ ఇచ్చిన నటుడు



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ హై వోల్టెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ రాబోతున్న విషయం తెలిసిందే. ''చీ= 31' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫైనల్ చేశారు మేకర్స్. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, టీ-సిరీస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనిల్ కపూర్, బిజు మీనన్, అశుతోష్ రాణా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు మేకర్స్. కానీ ఇటీవల ఎన్టీఆర్ చేతికి గాయం కావడంతో షూటింగ్‌కు బ్రేక్ పడింది. దీంతో సినిమా అనుకున్న టైమ్‌కు రిలీజ్ కాదని అంతా భావించారు. ఇలాంటి టైమ్‌లో షూటింగ్ అప్డేట్ ఇచ్చాడు నటుడు బిజు మీనన్. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఈయన డ్రాగన్ షూటింగ్ అప్డేట్ ఇస్తూ.. 'చీ= గారికి గాయం అవ్వడం వల్ల షూట్ కొంతకాలం ఆగింది. ఇప్పుడు తిరిగి ప్రారంభమైంది' అంటూ చెప్పుకొచ్చాడు.

కించపరచడానికి బదులు.. ప్రోత్సహించండి

ఆది సాయికుమార్ చురకలు

వైఫల్యాలు ఎదురైనంత మాత్రాన కెరీర్ ముగిసిపోయినట్లు కాదన్నారు నటుడు ఆది సాయికుమార్. ప్రతి హీరోకు ఒడుదొడుకులు ఉంటాయన్నారు. తాజాగా ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు ఆయన స్పందించారు. కొందరు హీరోలకు కనీసం యూటూబర్లకు ఉన్న ఫాలోయింగ్ కూడా ఉండదని ఓ నెటిజన్ పోస్ట్ పెట్టారు. దానికి ఆది సాయికుమార్ ఘాటుగా రిప్లై ఇచ్చారు. 'రణబాలి' ట్రైలర్‌పై నారా లోకేశ్ ప్రశంసలు.. థాంక్స్ చెప్పిన విజయ్ దేవరకొండ"ఇండస్ట్రీలో ప్రతి హీరో ప్రయాణం వెనక ఒక కథ ఉంటుంది. వారి విజయం కోసం ఎంతో శ్రమ చేసి ఉంటారు. మా నాన్న కూడా ఎన్నో ఏళ్లు కష్టాలు పడ్డారు. రవితేజ ఎన్నో ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చారు. అన్ని కష్టాలు ఎదుర్కొన్నంత మాత్రాన వాళ్ల కెరీర్‌లు ముగిసిపోయినట్లు కాదు కదా.. అందరూ ఒడుదొడుకులు ఎదుర్కొంటారు. అలాంటి వాళ్లను కించపరిచే బదులు వాళ్లను ప్రోత్సహించండి. సినీ జీవితంలో జయాపజయాలు సహజం. ఇలా నెగెటివ్ పోస్ట్‌ల వల్లే సోషల్ మీడియా సినిమాను సెలబ్రేట్ చేసుకునే వేదికగా కాకుండా.. అభిమానుల మధ్య యుద్ధాలకు వేదికగా మారుతోంది. ప్రతి ఒక్కరినీ గౌరవించడం నేర్చుకోండి" అని ఆది సాయికుమార్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

మతిపోగుడుతున్న మమత బైజు

మమిత ఖాతాలో పాన్ ప్రాజెక్ట్

'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయి యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌లో కూడా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది యంగ్ బ్యూటీ మమితా బైజు. ఈ మలయాళ ముద్దుగుమ్మ యాక్టింగ్‌తో పాటు తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు హృదయాలను దోచుకుంది. దీంతో వరుస ఆఫర్లు దక్కించుకోవడమే కాకుండా.. బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెహెం కుటుంబ యూనట్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ రాబట్టి మమితకు గోల్డెన్ లెగ్ పేరును తెచ్చిపెట్టాయి. ఇందులో భాగంగానే తాజాగా మమిత ఖాతాలో మరో పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తుంది. 2024లో వచ్చి సంచలన బ్లాక్‌బస్టర్ 'హనుమాన్' చిత్రానికి సీక్వెల్‌గా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-బడ్జెట్ మైథలాజికల్ సూపర్ హీరో యాక్షన్ చిత్రం 'జై-హనుమాన్'. 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి హనుమంతుడి పాత్రలో కనిపించబోతుండగా.. ఇందులో కీలకమైన పాత్ర కోసం మమితా బైజును సంప్రదించారట మేకర్స్. ఇప్పటికే కథ చర్చలు జరిగి మమిత కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఈ పాన్-ఇండియా మైథలాజికల్ యూనివర్స్‌లోకి అడుగు పెట్టినట్లు సమాచారం. ఈ పాత్రపై అధికారిక ప్రకటన రానప్పటికీ ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ కావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



Cinma సినిమా సింగిడి Singidi

ఆదివారం
11-10-2026



టాలీవుడ్ ఇండస్ట్రీకి ఆఫియా సయ్యద్..

బాలీవుడ్ ప్రముఖ నిర్మాత సాజిత్ నాడియాడ్‌వాలా మేనకోడలుగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ఆఫియా సయ్యద్. మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'ప్రేమలు' సినిమాకు హిందీ రీమేక్‌గా వచ్చిన 'ప్రేమ్ కీటాను' చిత్రంతో ఈ భామ హీరోయిన్‌గా పరిచయమైంది. ఈ చిత్రంలో వీర్ పహారియా సరసన నటించినప్పటికీ, ఆఫియా సయ్యద్‌కి మాత్రం మొదటి సినిమాతోనే సరైన హిట్ దక్కలేదు. ఆశించిన స్థాయిలో ఈ మూవీ ప్రేక్షకులను మెప్పించ లేక పోవడంతో ఆమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. అయితే బాలీవుడ్‌లో మొదటి ప్రయత్నం నిరాశపరి చినప్పటికీ, ఈ యంగ్ బ్యూటీ ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. క్రేజీ ప్రాజెక్ట్ 'అలియాస్ రుక్మిణీ'లో హీరోయిన్‌గా నటించనున్నట్లు నెట్టింట పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.



బలుపు అనుకుంటే ఏం చేయలేను..

ట్రోలర్స్‌కు ఇచ్చి పడేసిన విజయ్

రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన హాట్ కామెంట్స్ తో మరోసారి వార్తల్లో నిలిచాడు. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రణబాలి'. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్ లాంచ్ ఏర్పాటు చెయ్యగా.. ఇందులో పాల్గొన్న విజయ్ దేవరకొండ తనపై వచ్చే ట్రోల్స్‌పై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. 'కొంత మంది నా ఆత్మవిశ్వాసాన్ని బలుపుగా, నిజాయితీని అహంకారంగా భావిస్తున్నారు. ఇతరులకు నచ్చడం కోసం నా వ్యక్తిత్వాన్ని నేను మార్చుకోలేను. నా ప్రయాణం ఎవరికైనా అర్థం కాకపోతే నేనేం చెయ్యలేను. ముందు వారి ఆలోచనా విధానమే మారాలి' అని అన్నారు. అలాగే.. సోషల్ మీడియాలో జరుగుతున్న నెగటివిటీ సహజంగా జరుగుతున్నది కాదని, కొందరు గ్రూపులుగా ఏర్పడి డబ్బులు ఖర్చు చేస్తూ హీరోలను, సినిమాలను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా.. తన సినిమా 'రణబాలి' ట్రైలర్ విడుదల కాకముందే కొందరు కావాలని నెగటివ్ ప్రచారం మొదలు పెట్టారని విజయ్ మండిపడ్డారు. సినిమా కథ, కంటెంట్ పూర్తిగా తెలియకుండానే బ్రిటీష్ సినిమా అంటూ విమర్శలు చేస్తున్నారు. సినిమా చూడకముందే ఒక నిర్ణయానికి వచ్చి, ప్రేక్షకులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737